www.prajanaava.in

Telugu Daily

# ప్రజానావ

ప్రతి అక్షరం జనం కోసం..

పేజీలు : 08 | వెల : 5.00

Published from: Karimnagar, Circulated to: Hyderabad, Karimnagar, Warangal, Khammam, Nalgonda, Mahabubnagar, Nizamabad

హైదరాబాద్ | సంపుటి : 2 | సంచిక : 53 | మంగళవారం | 6 ఆగస్టు 2024



**టేబుల్ టెన్నిస్ క్వార్టర్ ఫైనల్లో భారత్**

8 లో..

## తెలంగాణలో ఉప ఎన్నికలు తప్పవు

**పార్టీ మారిన ఎమ్మెల్యేలపై అనర్హత అనివార్యం**

**న్యాయకోవిదులతో బీఆర్ఎస్ బృందం భేటీ**

**ప్రకటన విడుదల చేసిన వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**



**న్యూఢిల్లీ:**

పార్టీ మారిన ఎమ్మెల్యేల అనర్హత విషయంలో న్యాయపరమైన చర్యలు తీసుకునేందుకు బీఆర్ఎస్ ప్రయత్నాలు ముమ్మరం చేసింది. ఈ మేరకు ఢిల్లీలోని పలువురు ప్రముఖ న్యాయ కోవిదులతో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆధ్వర్యంలో సీనియర్ నాయ కుల బృందం చర్చలు జరిపింది. అటు రాజ్యాంగ నిపుణులతోనూ ఇవ్వాళ పార్టీ ప్రతినిధి బృందం సమావేశమైంది. బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటు తప్పదని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పత్రికా ప్రకటనలో పే ర్కొన్నారు. ఎమ్మెల్యేల పార్టీ ఫిరాయింపులపై ఢిల్లీలో బీఆర్ఎస్ న్యాయపోరాటం చే స్తుందని స్పష్టం చేశారు. రాజ్యాంగ నిపుణులతో బీఆర్ఎస్ పార్టీ సీనియర్ ప్రతినిధుల బృందం సమావేశం అయింది. త్వరలోనే సుప్రీంకోర్టులో పార్టీ తరఫున కేసు వేయ నున్నట్లు కేటీఆర్ తెలిపారు. కోర్టు తీర్పు ద్వారా నెల రోజుల్లోనే ఫిరాయింపు నేతల అనర్హత అంశంలో స్పష్టత వస్తుందని రాజ్యాంగ నిపుణులు చెబుతున్నారని, తెలంగా ణలో ఉప ఎన్నికలు తప్పవని...పార్టీ మారిన ఎమ్మెల్యేలకు ప్రజాక్షేత్రంలో బుద్ధి చెబు తామని కేటీఆర్ హెచ్చరించారు.

మిగతా 2 లో



## స్కిల్ వర్సిటీ చైర్మన్‌గా ఆనంద్ మహీంద్రా

**స్కిల్ వర్సిటీ ఏర్పాటు ద్వారా నైపుణ్య శిక్షణ**

- హైదరాబాద్‌ను ప్రపంచంలోనే అగ్రగామిగా నిలుపుతాం
- ప్రవాసాంధ్రులతో ముఖాముఖిలో సీఎం రేవంత్ రెడ్డి

**ఖైరతాబాద్, ప్రజానావ:**


తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ఏర్పాటు చేసిన యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ చైర్మన్‌గా ప్రముఖ పారిశ్రామికవేత్త ఆనంద్ మహీంద్రా వ్యవహరిస్తారని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. పెట్టుబడుల వేటలో భాగంగా ప్రస్తుతంఅమెరికా పర్యటనలో ఉన్న ముఖ్యమంత్రి.. న్యూజెర్సీలో ఏర్పాటు చేసిన ఓ కార్యక్రమంలో మాట్లాడారు. స్కిల్ వర్సిటీ ఛైర్మన్‌గా ఆయన రెం డు మూడు రోజుల్లో బాధ్యతలు చేపట్టే అవకాశం ఉందని తెలిపారు. రాష్ట్ర యువతకు నైపుణ్యాలు నేర్పించేలా రంగారెడ్డి జిల్లాలో ముచ్చర్లలోని బేగరి కంచెలో స్కిల్ యూనివర్సిటీ నిర్మాణానికి సీఎం గత వారం శంకుస్థాపన చేసిన విషయం తెలిసిందే. 17 రకాల కోర్సుల్లో శిక్షణ ఇచ్చి ప్రైవేటు సంస్థల్లో ఉపాధి

మిగతా 2 లో

## డెత్ సెంటర్లుగా ఢిల్లీ కోచింగ్ సెంటర్లు

- ముగ్గురు విద్యార్థుల దుర్మరణం ఘటనపై విచారణ
- కేంద్రం, ఢిల్లీ ప్రభుత్వాలకు సుప్రీం నోటీసులు

7 లో..



## ఢిల్లీ మద్యం కేసులో కేజ్రీకి చుక్కెదురు

**సీబీఐ అరెస్ట్‌ను సమర్థించిన కోర్టు**

3 లో..



## సెప్టెంబర్‌లో కశ్మీర్ అసెంబ్లీ ఎన్నికలు

**కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి వెల్లడి**

**న్యూఢిల్లీ:** జమ్మూ కశ్మీర్‌లో సెప్టెంబర్ లో అసెంబ్లీ ఎన్నికలు జరుగుతాయని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి వెల్లడించారు. రాష్ట్రంలో అభివృద్ధి పనులు వేగంగా సాగేందుకు, ఉగ్రవాదాన్ని అంతం చేసేందుకు బీజేపీకి ఓటు వేయాలని ప్రజలను కోరారు. ఐదేళ్ల కిందట ప్రధాని నరేంద్ర మోదీ

మిగతా 2 లో




## కవిత రెగ్యులర్ బెయిల్ విచారణ

**7కు వాయిదా వేసిన రౌస్ అవెన్యూ కోర్టు**

2 లో..





## పరవళ్లు తొక్కుతున్న కృష్ణమ్మ

**సాగర్‌లో 17 గేట్లు ఎత్తిన అధికారులు**

**నాగార్జునసాగర్, ప్రజానావ:**

ఎగువన వర్షాల నేపథ్యంలో వరద కృష్ణమ్మ పరవళ్లు తొక్కుతూ పూర్తిగా నిండడానికి వస్తుంది. ఉదయం 10:57 గంటలకు నీటిపారుదల శాఖ చీఫ్ ఇంజనీర్ సీఈ నాగేశ్వరరావు ఈఈ మల్లికార్జున రావు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం 16 క్రస్ట్ గేట్లను 5 అడుగుల మేరకు ఎత్తినారు. ఎగువ నుండి వస్తున్న వర ద పట్టి దశల వారీగా మొత్తం 16 గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్నామని సీఈ నాగేశ్వరరావు తెలి యజేశారు. భారీ వర్షాలకు తోడు ఎగువన కర్నాటక, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్ అన్ని ప్రాజెక్టులు పొంగి పొరు తుండడంతో నాగార్జునసాగర్ డ్యామ్ కు భారీ వరద పోటెత్తడం జరుగుతుంది. సంవత్సరంలో ఆగస్టులో ఈ సారి కూడా ఆగస్టులోనే నాగార్జున సాగర్ డ్యామ్ గరిష్ట నీటి మట్టానికి చేరుకోవడంతో గేట్లు తెరచుకున్నాయి.

మిగతా 2 లో

## పరిశ్రమలు పెట్టే యువతకు అన్ని విధాల సాయం

- మధిర ఇండస్ట్రియల్ పార్కుకు శంకుస్థాపన
- వ్యవసాయంతో పాటు పరిశ్రమలకు ప్రోత్సాహం
- డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క వెల్లడి

**ఖమ్మం, ప్రజానావ:**

యువత పరిశ్రమలు పెట్టేందుకు ముందుకొస్తే రుణాలతో పాటు అన్ని వసతులు కల్పిస్తామని తెలంగాణ డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. ఖమ్మం జిల్లా మధిర నియోజక వర్గంలోని ఎండపల్లిలో ఇండస్ట్రియల్ పార్కు పనులకు భట్టి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మధిరలో ఏర్పాటవుతున్న ఇండస్ట్రియల్ పార్కు రాష్ట్రానికి రోల్ మోడల్‌గా ఉండాలన్నారు. సమాజంలోని అన్ని వర్గాలనూ ప్రోత్సహించాలన్నదే ప్రభుత్వ లక్ష్యం.

మిగతా 2 లో



## జీవిత, ఆరోగ్య బీమా ప్రీమియంలపై జిఎస్‌టి

- గతేడాది ఆరోగ్య బీమాపై రూ.8,263 కోట్ల వసూళ్లు
- లోక్‌సభకు వెల్లడించిన కేంద్ర ప్రభుత్వం




2 లో..

## సైన్యం చేతుల్లోకి బంగ్లాదేశ్

**ప్రధానిని రాజీనామా చేయాలన్న ఆర్మీ చీఫ్**

**తప్పించుకుని ప్రవాసంలోకి వెళ్లిన ప్రధాని హసీనా**

**ఢాకా:** బంగ్లాదేశ్‌లో చోటుచేసుకున్న హింసాత్మక ఘటనలతో పరిస్థితి చేజారింది. దాంతో సైన్యం రంగంలో దిగింది. దేశం మొత్తం దాని నియంత్రణలోకి వచ్చింది. ఆర్మీ చీఫ్ వాకర్-జమాన్ దేశ

మిగతా 3 లో



**బంగ్లా పరిణామాలతో భారత్ అప్రమత్తం**

- సరిహద్దుల్లో బలగాల మోహరింపు
- ఢాకాకు విమాన, రైలు సర్వీసుల నిలిపివేత
- హసీనా ఇంటిని దోచేసిన ఆందోళనకారులు

2 లో..

# స్కిల్ వర్సిటీ చైర్మన్‌గా ఆనంద్ మహీంద్రా

(మొదటిపేజీ తరువాయి)

అవకాశాలు కల్పించనున్నారు. ఏటా లక్షమందికి శిక్షణ ఇచ్చేలా రాబోయే కాలంలో ఈ వర్సిటీని విస్తరించనున్నారు. బేగరికంచెలో సొంత భవనం పూర్తయ్యే వరకు గచ్చిబౌలిలోని ఇంజినీరింగ్ స్టాఫ్ కాలేజీ ఆఫ్ ఇండియా భవనంలో వర్సిటీ కార్యకలాపాలు కొనసాగనున్నాయి. ఇకపోతే హైదరాబాద్‌ను ప్రపంచంలోనే అగ్రగామి నగరంగా నిలుపుతామని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. న్యూజెర్సీలో ఆదివారం జరిగిన ప్రవాసుల ఆత్మీయ సమ్మేళానికి హాజరైన సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ వీరీ జన్మభూమి, వీరీ దేశంలో వీరీరు పెట్టిన ప్రతి పెట్టుబడికి తప్పకుండా ప్రయోజనం ఉంటుంది. అంతకు మించిన అత్యుత్తమ ప్రతిఫలం ఉంటుందని అన్నారు. మన ప్రాంత అభివృద్ధిలో భాగస్వామ్యం పంచుకుంటే అంతకు మించిన సంతృప్తి బోనస్ గా లభిస్తుంది..'అని అన్నారు. ఎన్నికల ముందు మాపై ఎంతో విష ప్రచారం జరిగిందని, గిట్టని వాళ్లందరూ అసలు కాంగ్రెస్ అధికారంలోకి రాదని అన్నారనని, వచ్చినా నిలబడదని అన్నారని సీఎం చెప్పారు. ఇప్పుడు రాష్ట్రంలో అభివృద్ధి మందగిస్తుందంటూ లేనిపోని అపోహలు సృష్టించేందుకు కొందరు ప్రయత్నిస్తున్నారని అన్నారు. వాళ్లకు ఇప్పటికే బుద్ధి చెప్పామని, అబద్దాల కోరుల మాటలు తప్పని నిరూపిద్దామని, హైదరాబాద్‌ను భారతదేశంలోనే కాదు.. ప్రపంచంలోనే అగ్రగామి నగరంగా నిలుపుదామని సీఎం పిలుపునిచ్చారు. ప్రవాసులు తమ నైపుణ్యాలు, వీరీ ప్రతిభాపాటవాలతో అమెరికాను పటిష్టంగా, సంపన్నంగా మార్చారని, ఇకపై తెలంగాణకు సేవలు అందించాలని కోరారు. తెలంగాణలో మెట్రో కోర్ అర్బన్ తో పాటు , సెమీ అర్బన్, రూరల్ క్లస్టర్లుగా విభజించి పెట్టుబడులకు ప్రత్యేకమైన వ్యవస్థలను రూపొందిస్తున్నామని సీఎం రేవంత్ రెడ్డి చెప్పారు. ఈస్ట్ కోస్ట్ ఇండియన్ కమ్యూనిటీకి చెందిన పలువురు ముఖ్యులతో సీఎం మాట్లాడుతూ, హైదరాబాద్, సికింద్రాబాద్, సైబరాబాద్ తరహాలో నాలుగో నగరంగా ఫ్యూచర్ సిటీని అభివృద్ధి చేస్తున్నట్లు చెప్పారు. ప్రపంచ స్థాయి మాస్టర్ ప్లాన్ తో హైదరాబాద్‌ను తీర్చిదిద్దనున్నామని అన్నారు. ఓవర్సీస్ కాంగ్రెస్ పార్టీ అమెరికా అధ్యక్షుడు మోహిందర్ సింగ్ గిల్జియాన్ మాట్లాడుతూ.. 'మిమ్మల్ని ముఖ్యమంత్రిగా చూడాలన్న మా కోరిక నెరవేరింది. ఇప్పుడు రాహుల్ గాంధీని భారత ప్రధానిని చేయడానికి మనమందరం కష్టపడాలి' అన్నారు. సాఫ్ట్‌వేర్, ఫార్మా, వ్యాక్సిన్‌లు, హెల్త్ కేర్, అర్టిఫిషియల్ రంగాల్లో తెలంగాణ బలమైన స్థావరంగా ఎదగాలని ఆకాంక్షించారు.

# కవిత రెగ్యులర్ బెయిల్ విచారణ

## 7కు వాయిదా వేసిన రౌస్ అవెన్యూ కోర్టు

**న్యూఢిల్లీ:** దేశ వ్యాప్తంగా పెను సంచలనం సృష్టించిన ఢిల్లీ లిక్కర్ స్కామ్ కేసులో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఇప్పట్లో తీహార్ జైలు నుంచి బయటికి వచ్చే మార్గాలు ఏ మాత్రం కనిపించట్లేదు. ఇప్పటికే బెయిల్ పిటిషన్‌ను పలుమార్లు పక్కన పెట్టిన రౌస్ అవెన్యూ కోర్టు.. సోమవారం నాడు డీఫాల్ట్ బెయిల్ పిటిషన్ విచారణను వాయిదా వేసింది. ఆగస్టు-7 కు తదుపరి విచారణను వాయిదా వేస్తున్నట్లు జడ్జ్ కావేరి భవేజా స్పష్టం చేశారు. సీనియర్ అడ్వకేట్ అందుబాటులో లేకపోవడంతో కేసును మరో రోజుకు వాయిదా వేయాలని కోరిన కవిత తరపు లాయర్ కోర్టును కోరారు. ఈ క్రమంలో తదుపరి విచారణను జడ్జ్ కావేరి భవేజా వాయిదా వేశారు. అయితే రౌస్ అవెన్యూ కోర్టులో ఎల్లుండి ఏం జరుగుతుందో ఏమో అని బీఆర్ఎస్‌లో టెన్షన్ పెరిగిపోయింది. కాగా.. కవితను మార్చి-15న తొలుత ఈడీ, ఆ తర్వాత ఏప్రిల్-11న సీబీఐ అరెస్టు చేసిన విషయం తెలిసిందే. ఈడీ, సీబీఐ పెట్టిన రెండు కేసుల్లోనూ సాధారణ బెయిల్ ఇవ్వాలన్న పిటిషన్‌ను గతంలోనే ట్రయల్ కోర్టు కొట్టివేసింది. ఈ ఆదేశాలను ఢిల్లీ హైకోర్టులో సవాల్ చేయగా అక్కడా నిరాశే ఎదురైంది. ఈ నేపథ్యంలోనే ట్రయల్ కోర్టులోనే మళ్లీ బెయిల్ పిటిషన్ దాఖలు చేశారు. దీన్ని జూలై-22న విచారించిన ట్రయల్ కోర్టు జడ్జి కావేరి బవేజా కేసును సోమవారానికి(ఆగస్టు-05) వాయిదా వేశారు. దీనిపై ఎలాంటి నిర్ణయం వెలువడుతుందనేది ఆసక్తికరంగా మారిన ఈ పరిస్థితుల్లో మ-రోసారి విచారణ వాయిదా పడిరది. ఇదిలా ఉంటే.. తిహాడ్ జైలులో ఉన్న కవితను ఆమె సోదరుడు, మాజీ మంత్రులు కల్వకుంట్ల కేటీఆర్, తన్నీరు హరీశ్‌రావు ఇవాళ కలిసే అవకాశం ఉన్నట్లు బీఆర్ఎస్ వర్గాలు చెబుతున్నాయి.

# జీవిత, ఆరోగ్య బీమా ప్రీమియంలపై జిఎస్‌టి

**న్యూఢిల్లీ:** జీవిత, ఆరోగ్య బీమా ప్రీమియంలపై వస్తు, సేవల పన్ను జిఎస్‌టి తొలగించాలన్న డిమాండ్ల వేళ ఆసక్తికర గణాంకాలను కేంద్రం పార్లమెంట్ ముందుం చింది. 2023-24 ఆర్థిక సంవత్సరంలో ఒక్క ఆరోగ్య బీమా ప్రీమియంలపైనే రూ.8,263 కోట్ల జీఎస్టీ రూపంలో వసూలైనట్లు కేంద్రం పార్లమెంట్‌కు తెలిపింది. ఈ మేరకు లోక్‌సభ సభ్యుడు అడిగిన ప్రశ్నకు కేంద్ర ఆర్థికశాఖ సహాయ మంత్రి పంకజ్ చౌధరి సోమవారం లిఖిత పూర్వక సమాధానం ఇచ్చారు. ఆరోగ్య బీమా, జీవిత బీమా పాలసీలపై జీఎస్టీని తొలగించాలని ఇటీవల కేంద్రమంత్రి గడ్కరీ.. ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు లేఖ రాశారు. తృణమూల్ అధినేత్రి మమతా బెనర్జీ సైతం ఇదే తరహా విజ్ఞప్తి చేశారు. ఈ నేపథ్యం లో వీటిని తొలగించాలంటూ పలు విజ్ఞప్తులు వచ్చినట్లు పంకజ్ చౌధరి వెల్లడించారు. ఈ రెండు రకాల బీమా ప్రీమియంలపై ప్రస్తుతం 18 శాతం చొప్పున జీఎస్టీ వసూలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. అయితే, పేదలు, దివ్యాంగుల కోసం ఉద్దేశించిన రాష్ట్రీయ స్వాస్థ్య బీమా యోజన, యూనివర్సల్ హెల్త్ ఇన్సూరెన్స్ స్కీమ్, జన ఆరోగ్య బీమా పాలసీ, నిర్మయ హెల్త్ ఇన్సూరెన్స్ స్కీమ్ వంటి కొన్ని రకాల బీమా పాలసీ ప్రీమియంలను జీఎస్టీ నుంచి మినహాయించినట్లు చౌధరి చెప్పారు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో ?8,262.94 కోట్లు, 2022-23 ఆర్థిక సంవత్సరంలో 7,638 కోట్లు, 2021-22 ఆర్థిక సంవత్సరంలో 5,354 కోట్లు ఆరోగ్య బీమాపై జీఎస్టీ రూపంలో వచ్చినట్లు మంత్రి చెప్పారు. జీఎస్టీ తొలగింపుపై కేంద్రం, రాష్ట్రాలతో కూడిన జీఎస్టీ కౌన్సిల్ నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

# బంగ్లా పరిణామాలతో భారత్ అప్రమత్తం

## సరిహద్దుల్లో బలగాల మోహరింపు

## ఢాకాకు విమాన, రైలు సర్వీసుల నిలిపివేత

**ఢాకా:** బంగ్లాదేశ్‌లో రిజర్వేషన్ ఆందోళన పతాక స్థాయికి చేరుకోవడం, ప్రధాని షేక్ హసీనా అధికార నివాసంపై ఉవ్వెత్తున ఆందోళన కారులు దాడి చేయడం, దీనికి కొద్ది క్షణాలకు ముందే ఆమె తన పదవికి రాజీనామా చేసి సి-130 ఆర్మీ ఎయిర్‌క్రాఫ్ట్‌లో దేశం విడిచిపెట్టడం వంటి పరిణామాలు శరవేగంగా చోటు చేసుకున్న క్రమంలో ఆర్మీ చీఫ్ వాకరుజ్జమాన్ దేశంలో సైనికపాలన ప్రకటించారు. విపక్ష పార్టీలతో సంప్రదించి దేశంలో మధ్యంతర ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్నట్టు ప్రకటించారు. మరి కాసేపట్లోనే అధ్యక్షుడు మహ్మద్ షహబుద్దీన్‌ను కలుసుకోనట్టు తెలిపారు. ప్రజలంతా హింసకు దూరంగా ఉండాలని టీవీలో దేశ ప్రజలను ఉద్దేశించి పిలుపునిచ్చారు. బంగ్లాదేశ్ ఆర్మీ చీఫ్‌గా జూన్ 23న వాకరుజ్జమాన్ (58) బాధ్యతలు చేపట్టారు. మూడేళ్ల పాటు పదవీ కాలంలో ఉంటారు. ఢంకాలో 1966లో ఆయన జన్మించారు. జనరల్ మహమ్మద్ ముస్తఫిజుర్ రెహ్మాన్ కుమార్తెను వివాహమాడారు. ముస్తఫిజుర్ రెహ్మాన్ 1997 నుంచి 2000 వరకూ ఆర్మీ చీఫ్‌గా పనిచేశారు. వాకరుజ్జమాన్ డిఫెన్స్ స్టడీస్‌లో మాస్టర్ డిగ్రీ చేశారు. నేషనల్ యూనివర్శిటీ ఆఫ్ బంగ్లాదేశ్ పూర్వవిద్యార్థి కూడా. లండన్ కింగ్స్ కాలేజీ డిఫెన్స్ స్టడీస్‌లో ఎంఏ చేశారు. దేశ ఆర్మీ చీఫ్‌గా పగ్గాలు చేపట్టానికి ముందు ఆరు నెలలు చీఫ్ ఆఫ్ జనరల్ స్టాఫ్‌గా పనిచేశారు. మూడు దశాబ్దాల కెరీర్‌లో ఆయన షేక్ హసీనాతో సన్నిహితంగా పనిచేశారు.

# తెలంగాణలో ఉప ఎన్నికలు తప్పవు

(మొదటిపేజీ తరువాయి)



మరోవైపు ఇప్పటికే పార్టీ ఫిరాయింపుల విషయంలో మణిపూర్‌కు సంబంధించి ఎమ్మెల్యే సహా సుప్రీంకోర్టు పలు తీర్పులు ఇచ్చిందని రాజ్యాంగ నిపుణులు పార్టీ బృందానికి తెలిపారు. గతంలో మాదిరిగా అనర్హత వేటు విషయంలో సుదీర్ఘకాలం పాటు నిర్ణయం తీసుకోకుండా స్పీకర్ ఈ అంశాన్ని నాన్చలేరని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ముగ్గురు ఎమ్మెల్యేల అనర్హత వేటుకు సంబంధించి హైకోర్టులో వేసిన పిటిషన్‌తో పాటు, పార్టీ మారిన ఎమ్మెల్యేలపైన స్పీకర్‌కు చేసిన ఫిర్యాదు విషయాన్ని, వాటికి సంబంధించిన పత్రాలను న్యాయ నిపుణులకు బీఆర్ఎస్ నేతలు అందించారు. ఈ విషయంలో ప్రస్తుతం సుప్రీంకోర్టు మార్గదర్శకాలు స్పష్టంగా ఉన్నందున హైకోర్టు సైతం ఎక్కువ కాలం వాయిదా వేసే అవకాశం లేదని న్యాయ నిపుణులు తెలిపారు. హైకోర్టు నిర్ణయం త్వరగా ప్రకటించకుంటే సుప్రీంకోర్టుకు వెళ్లే అవకాశం ఉందన్నారు. సుప్రీంకోర్టు తీర్పులతోపాటు న్యాయ కోవిదులు, రాజ్యాంగాన్ని నిపుణులు చెబుతున్న సలహాలు, సూచనల మేరకు న్యాయపోరాటం కొనసాగిస్తామని కేటీఆర్ తెలిపారు. త్వరలోనే సుప్రీంకోర్టును ఆశ్రయిస్తామన్నారు. హైకోర్టు లేదా సుప్రీంకోర్టు ద్వారా నెల రోజుల్లో పార్టీ మారిన ఎమ్మెల్యే ల పైన అర్హత వేటు అంశం తేలిపోతుందని కేటీఆర్ విశ్వాసం వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్రంలో ఉప ఎన్నికలు తప్పవని... పార్టీ మారిన ఎమ్మెల్యేలకు ప్రజాక్షేత్రంలోనే బుద్ధి చెప్తామన్నారు. ఒకవైపు జాతీయ స్థాయిలో పార్టీ ఫిరాయింపుల పైన సుద్దపూస ముచ్చట్లు చెబుతూ తెలంగాణ రాష్ట్రంలో రాజ్యాంగ స్ఫూర్తిని దెబ్బతీసేలా కాంగ్రెస్ పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహిస్తుందని కేటీఆర్ మండిపడ్డారు. త్వరలోనే కోర్టుల సహాయంతో కాంగ్రెస్‌కు సరైన గుణపాఠం చెబుతామన్నారు. రాజ్యాంగ నిపుణులు, న్యాయ కోవిదులతో జరిగిన సమావేశంలో పార్టీ సీనియర్ నాయకులు మాజీ మంత్రి హరీష్ రావు, జగదీష్ రెడ్డి, గంగుల కమలాకర్, రాజ్యసభ సభ్యులు వద్ధిరాజు రవిచంద్ర, ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి సహా పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# పరిశ్రమలు పెట్టే యువతకు అన్ని విధాల సాయం

(మొదటిపేజీ తరువాయి)

మధిర పట్టణ విస్తరణకు కావాల్సిన బైపాస్ రోడ్లు నిర్మిస్తాం. ఇండస్ట్రియల్ పార్కుకు రూ.44కోట్లు కేటాయించాం. విద్య, వ్యవసాయక, పారిశ్రామిక కేంద్రంగా మధిరను నిలుపుతాం. వ్యవసాయంతో పాటు పరిశ్రమలు, సేవా రంగాలను అభివృద్ధిచేసుకొని సమగ్రాభివృద్ధి సాధించాలి. గ్రామాల్లో ఉన్నవారు పరిశ్రమల వైపు మళ్లితే ప్రభుత్వం అన్ని రకాలుగా ప్రోత్సాహమిచ్చేందుకు సిద్ధంగా ఉందని అన్నారు. రాష్ట్రంలోని యువత పరిశ్రమలు పెట్టేందుకు ముందుకు వస్తే రుణాలు ఇప్పిస్తాని.. అందుకు తగ్గ వసతులు కల్పిస్తామన్నారు. స్వయం సహాయక సంఘాల మహిళలకు ప్రతి ఏడాది 20వేల కోట్ల వడ్డీ లేని రుణాలు మంజూరు చేస్తున్నామని తెలిపారు. ఈ డబ్బులు ఎక్కడ పెట్టుబడి పెట్టాలనే ఆలోచన వారికి ఉండదని.. అందుకే ప్రభుత్వమే పరిశ్రమలు, వ్యాపారానికి సంబంధించిన ప్రాజెక్టు రిపోర్టు, బ్యాంకు రుణాలు, మార్కెటింగ్ వసతులు కల్పించి పారిశ్రామిక రంగంలో వారిని ప్రోత్సహిస్తామని తెలిపారు. ఇలాంటి బృహత్తర కార్యక్రమానికి మధిర నియోజకవర్గంలో పునాది పడిరదన్నారు. ఎప్పుడూ వ్యవసాయం అని ఒకే రంగంపై ఆధారపడితే క్లిష్ట పరిస్థితులు వచ్చినప్పుడు ఇబ్బందులు పడతామని... వ్యవసాయంతో పాటు పరిశ్రమలు, సేవా రంగాలను అభివృద్ధి చేసుకొని సమగ్ర అభివృద్ధి సాధిస్తే సమాజానికి మేలు జరుగుతుందన్నారు. గ్రామాల్లో బాగా చదువుకున్న వారు ఉన్నారని.. అందరికీ ఉద్యోగాలు రావని.. గ్రామాల్లో ఉన్నవారు పరిశ్రమల వైపు మళ్ళితే ప్రభుత్వం అన్ని రకాలుగా ప్రోత్సహించేందుకు సిద్ధంగా ఉందన్నారు. ఇదే దేశ భవిష్యత్తుకు మంచిదని తెలిపారు. గ్రామాల్లో వ్యాపారం చేసేవారు సమాజంలో మారిన పరిస్థితులకు అనుగుణంగా వ్యాపారాన్ని అభివృద్ధి చేసుకోవాలన్నారు. గ్రామాల్లో వ్యాపారం చేసేవారు మరింత ముందుకు వెళ్లేందుకు బ్యాంకుల నుంచి సకాలంలో రుణాలు ఇప్పించి వ్యాపారులను కాంగ్రెస్ ప్రభుత్వం ప్రోత్సహిస్తుందన్నారు. మధిరలో ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటు చేయడం దశాబ్దాల కల అన్నారు. 55 ఎకరాల్లో నిర్మించనున్న పార్కుకు 44 కోట్ల నిధులు కేటాయించామని తెలిపారు. మధిర పార్కు పనులకు వెంటనే టెండర్లు పిలిచి వేగంగా పనులు ప్రారంభిస్తామని తెలిపారు. నిరుద్యోగ యువత పరిశ్రమల వైపు వచ్చేందుకు విస్తృతంగా ప్రచారం కల్పించాలని అధికారులను ఆదేశించారు. మధిర ఇండస్ట్రియల్ పార్కును అనుసంధానించేందుకు రెండు వైపులా రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేశామన్నారు. ఇతర ప్రాంతాల నుంచి వచ్చి యువత ఈ పారిశ్రామిక ప్రాంతాన్ని సందర్శించేలా తీర్చిదిద్దాలని ఆశాభావం వ్యక్తం చేశారు. ఇండస్ట్రియల్ పార్కులో తక్కువ ధరలకే ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు ప్లాట్లు కేటాయిస్తామని.. కేటాయింపులో ఎస్సీ, ఎస్టీ, బీసీలతోపాటు మహిళలకు రిజర్వేషన్లు కల్పిస్తామన్నారు. సమాజంలో ఉన్న అన్ని వర్గాలను ప్రోత్సహించాలన్నదే తమ ప్రభుత్వ ఉద్దేశమన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజధానికి మధిర సమీపంలో ఉందని.. విజయవాడ-నాగపూర్, దేవరపల్లి గ్రీన్ ఫీల్డ్ హైవేలు మధిర నియోజకవర్గం మీదుగా వెళుతున్నాయని.. ఇవి అభివృద్ధికి మూల స్తంభాలుగా పనిచేస్తాయని తెలిపారు. మధిర పట్టణం విస్తరణకు కావలసిన బైపాస్ రోడ్లు నిర్మిస్తామని.. చదువుల కోసం, ఉపాధి కోసం మధుర నుంచి ఖమ్మం, హైదరాబాద్, అమెరికాలో స్థిరపడుతు న్నారు ఇక్కడ సమగ్ర అభివృద్ధిని అందిస్తే వారంతా ఇక్కడే స్థిరపడతారని పేర్కొన్నారు. ఇండస్ట్రియల్ వద్ద ప్రత్యేకంగా ఒక ఉద్యోగిని నియమించి పరిశ్రమలు స్థాపించేందుకు వచ్చే వారి నుంచి దరఖాస్తులు తీసుకోవడం.. సమాచారం అందించడం వంటి బాధ్యతలు అప్పగిస్తామన్నారు.

# సెప్టెంబర్‌లో కశ్మీర్ అసెంబ్లీ ఎన్నికలు

(మొదటిపేజీ తరువాయి)

నేతృత్వంలోని ప్రభుత్వం ఆర్టికల్ 370ని రద్దు చేసిందన్నారు. దాంతో జమ్మూ కశ్మీర్‌లో పాక్, గూఢచార సంస్థ, ఐఎస్ఐ కార్యకలాపాలు చాలా వరకు అరికట్టగలిగామని కేంద్రమంత్రి పేర్కొన్నారు. జమ్మూకశ్మీర్‌లో బీజేపీ ఎన్నికల ఇన్‌ఛార్జ్‌గా కేంద్రమంత్రి జి కిషన్‌రెడ్డిని బీజేపీ అధిష్ఠానం నియమించిన విషయం తెలిసిందే. ఆర్టికల్ 370ని రద్దు చేసి ఐదో వార్షికోత్సవం సందర్భంగా జమ్మూలోని బానా సింగ్ స్టేడియంలో పార్టీ నిర్వహించిన 'ఏకాత్మ మహోత్సవ్' పాల్గొని, ఆయన ప్రసంగించారు. ఆయన ప్రసంగిస్తూ.. సెప్టెంబర్‌లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయని, ఆర్టికల్ 370ని రద్దు చేసి, బీజేపీని పొడిగిస్తూ వచ్చిన మార్పులను చూసి ప్రజలు బీజేపీని పూర్తి మెజారిటీతో అధికారంలోకి తీసుకువస్తారనే నమ్మకం ఉందన్నారు. ఇదిలా ఉండగా.. సుప్రీంకోర్టు ఇచ్చిన సెప్టెంబర్ 30 గడువులోగా అసెంబ్లీ ఎన్నికలు నిర్వహించేందుకు ఈసీ ఏర్పాట్లు చేస్తున్నది. ఎన్నికల నిర్వహణకు అవసరమైన సన్నాహాలను సమీక్షించేందుకు ఈసీ బృందం ఈ నెల 8 నుంచి 10వ తేదీ వరకూ జమ్మూకశ్మీర్‌లో పర్యటించబోతున్నది. ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీవ్‌కుమార్, ఎన్నికల కమిషనర్లు జ్ఞానేష్ కుమార్, ఎస్ఎస్ సంధు అక్కడ పర్యటించనున్నారు. మొదట రాజకీయ పార్టీలతో తొలుత కమిషన్ సమావేశం కానున్నది. సీఈవో, ఎస్పీఎన్‌వో, సెంట్రల్ ఫోర్సెస్ కోఆర్డినేటర్‌తోనూ సమీక్షించనున్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, డీజీపీ, జిల్లా ఎన్నికల అధికారులు, ఎస్పీలతో కమిషన్ సమావేశమై ఎన్నికల సహకాలపై సమీక్షించనున్నారు. ఈ నెల 10న జమ్మూలో పర్యటించి ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెన్సీలతో సమావేశమై.. ఆ తర్వాత మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించే అవకాశం ఉన్నది.

# సైబర్ నేరాల అడ్డుకట్టకు కృషి

## సొమ్ము రికవరీలో సైబర్ సెక్యూరిటీ కృషి

## బాధితులు పోగొట్టుకున్న రూ.85.05 కోట్లు రికవరీ

**ఖైరతాబాద్, ప్రజానావ:** టెక్నాలజీ పెరిగిన తర్వాత సైబర్ బాబులు బాగా రెచ్చిపోతున్నారు. ఇన్నాళ్లు ఇలాంటి వారిని గుర్తించడం కఠినంగానే ఉండేది కానీ వారితో పాటు పోలీసులు కూడా కొత్త పంథాలను ఎంచుకోవడంతో ఇలాంటి దాడులకు పాల్పడేవారిని గుర్తించి వారి నుంచి సొమ్మును దాదాపుగా రికవరీ చేస్తున్నారు. ముఖ్యంగా సైబర్ నేరాల్లో బాధితుల నుంచి నేరగాళ్లు కాజేసిన సొమ్మును తిరిగి తీసుకొచ్చేందుకు తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో తీవ్రంగా కృషి చేస్తోంది. ఇందులో భాగంగా గత ఐదు నెలల వ్యవధిలో తెలంగాణ లీగల్ సర్వీసెస్ అథారిటీతో కలిసి పోగొట్టుకున్న బాధితుల సొమ్ము రూ.85.05 కోట్లు, అందులో సైబరాబాద్, హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలోవే రూ.36.8 కోట్లు తిరిగి బాధితులకు ఇచ్చినట్లు అధికారులు తెలిపారు. దీంతోపాటు సైబర్ నేరాలకు సంబంధించి దీర్ఘకాలంగా బ్యాంకుల వద్ద నిలిచిపోయిన బాధితుల సొమ్మును లోక్ ఆదాలత్‌ద్వారా కూడా వారికి ఇప్పించినట్లు తెలిపారు. సైబర్ నేరాల్లో బాధితులు పోగొట్టుకున్న సొమ్మును వారి ఫిర్యాదు ద్వారా ఫ్రీజ్ చేసిన తర్వాత వాటిని 457 సెక్షన్ కింద దర్యాప్తు అధికారి కోర్టులో పిటిషన్ ఫైల్ చేస్తే కోర్టుల అనుమతితో వాటిని బాధితులకు తిరిగి ఇచ్చే అవకాశం ఉందన్నారు. కేవలం హైదరాబాద్?లోనే కాకుండా అన్ని జిల్లాల్లో కూడా దీనిపై అవగాహన కల్పిస్తున్నట్లు ఆమె తెలిపారు. ఇప్పటివరకు 6,449 పిటిషన్లకు సంబంధించిన రూ.85.05 కోట్లను బాధితులకు తిరిగి ఇచ్చినట్లు పేర్కొన్నారు.

# పరవళ్లు తొక్కుతున్న కృష్ణమ్మ

(మొదటిపేజీ తరువాయి)

ఎగువన శ్రీశైలం డ్యామ్ వద్ద అన్ని గేట్లు ఎత్తేసి నాలుగు లక్షలకు పైగా వరద దిగువనకు వదులుతున్నారు. దీంతో ఈ వరద వేగంగా సాగర్‌కు చేరుకుంటోంది. శ్రీశైలానికి ఎగువ నుంచి 4,00,491 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతుండటంతో 590 అడుగులకు గాను 583 అడుగుల నీరు ప్రస్తుతం చేరింది. సాగర్ యొక్క మొత్తం టిఎంసిలో 312 గాను 290 టీఎంసీలు నీళ్లు ఉన్నాయి గేట్ల ద్వారా43 వేల 986 క్యూసెక్కుల నీరు దిగువనకు విడుదల చేశారు. మొత్తానికి ఇన్ ఎ÷-లో 3 లక్షల 23 వేల 331 క్యూసెక్కుల వరద కొనసాగుతుంది. ఔట్ ఎ÷-లో లక్షా 63 వలే 220 క్యూసెక్కులు. కుడి ఎడమ కాలువల ద్వారా మొత్తానికి ఔట్ ఎ÷-లో 83 వేల 549 క్యూసెక్కుల వరద వచ్చే చేరుతుంది. ప్రవాహానికి అనుగుణంగా దిగువకు నీటి విడుదల చేస్తున్నారు. వరద పెరిగే కొద్దీ మరికొన్ని గేట్లు కూడా ఎత్తి విడుదల చేస్తామని అధికారులు చెబుతున్నారు.

# పులిచింతలకు భారీగా వరదనీరు

## 4 గేట్లు ఎత్తి నీరు దిగువకు విడుదల

**పల్నాడు, ప్రజానావ:** వరదనీరు వస్తుండటంతో పల్నాడు జిల్లాలో పులిచింతల ప్రాజెక్టు గేట్లు తెరుచుకున్నాయి. నాలుగు గేట్లు ఎత్తిన అధికారులు.. 26,083 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ఎగువ నుంచి పులిచింతలకు 30,388 క్యూసెక్కులు వరదనీరు వస్తోంది. పులిచింతల పూర్తి నిల్వ సామర్థ్యం 45.77 టీఎంసీలు కాగా... ప్రస్తుతం ప్రాజెక్టులో 3.61 టీఎంసీల నీరు మాత్రమే ఉంది. నాగార్జున సాగర్ గేట్లు ఎత్తి సాగర్ నుంచి లక్ష క్యూసెక్కులకు పైగా నీటిని వదిలారు. ఇవాళ రాత్రికి అది పులిచింతల ప్రాజెక్టుకు చేరుకోనుంది. అప్పటికి మరికొన్ని గేట్లు ఎత్తేందుకు అధికారుల ప్రణాళికలు రూపొందించారు. పులిచింతల దిగువ ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారుల సూచించారు. వరద ఇంకా పెరిగే అవకాశం ఉండటంతో ఆ మేరకు అధికారులు సిద్ధమయ్యారు. ప్రాజెక్టులో నీటి నిల్వ లేనప్పటికీ భారీ వరద దృష్ట్యా అధికారులు గేట్లు ఎత్తారు. శ్రీశైలం, నాగార్జున సాగర్ ప్రాజెక్టులకు భారీగా ఇన్‌ఫ్లో ఉంది. వరద ఇంకా కొనసాగే అవకాశం ఉండటంతో ఆ ప్రాజెక్టుల నుంచి పులిచింతలకు నీరు రానుంది.

# పార్లమెంట్‌లో బీసీ కులగణన బిల్లు పెట్టాలి

## మాజీ ఎంపి విహెచ్ డిమాండ్

**న్యూఢిల్లీ:** పార్లమెంట్‌లో బీసీ కులగణన బిల్లు పెట్టాలని కేంద్ర ప్రభుత్వాన్ని మాజీ ఎంపీ వి.హనుమంతరావు డిమాండ్ చేశారు. పార్లమెంట్‌లో అనురాగ్ ఠాకూర్ దిగజారి ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీపై మాట్లాడారని అన్నారు. నిర్మల సీతారామన్ బీసీ ప్రధానమంత్రి అయ్యారని చెబుతున్నారన్నారు. పదేళ్లలో ఓబీసీ ఎంపీలం కలిసి బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ పెట్టాలని గతంలో ప్రధానమంత్రిని కలిశామని కానీ ఇప్పటి వరకు బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ పెట్టలేదని మండిపడ్డారు. ఎస్సీ , ఎస్టీ ఓబీసీల్లో ఒక ఆలోచన వచ్చిందని అన్నారు. రాహుల్ గాంధీ ఒక ఆశగా ఇప్పుడు అందరికీ కనిపిస్తున్నారని అన్నారు. ఈసారి కులగణన జరగాలంటే రాహుల్ గాంధీ రావాలని అందరు కోరుకుంటున్నారని తెలిపారు. తెలంగాణలో బీసీ కుల గణనకు రూ. 150 కోట్లు కేటాయించారని గుర్తుచేశారు. మంత్రి పొన్నం ప్రభాకర్ వెంటనే కులగణన సంబంధించిన ప్రక్రియ ప్రారంభించాలని కోరారు. న్యాయం జరగాలంటే కుల గణన జరగాలని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బడ్జెట్‌లో నిధులు కేటాయించారని చెప్పారు. కుల గణన చేపడుతామని అన్నారన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కులగణనపై ఒక్క మాట కూడా ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. బీజేపీకి బీసీ నాయకత్వం మాత్రం కావాలన్నారు.



## సైబర్ నేరగాళ్ల మాయలో వైద్యుడు!

• రూ.72 లక్షలు కాజేసిన కేటుగాళ్లు • పోలీసులను ఆశ్రయించిన బాధితుడు

**ఇబ్రహీంపట్నం, ప్రజానావ:** సైబర్ నేరగాళ్ల ఆగడాలకు అంతు లేకుండా పోతుంది. కొత్త యాప్లు, లింక్ల పేరిట డబ్బులు కాజేస్తున్నారు. ఈజీగా డబ్బులు వెనకేసుకుం దామనే ఆశతో ఆనేక మంది సైబర్ నేరగాళ్ల ఊబిలో చిక్కుకుంటు న్నారు. ఆర్థికంగా నిండా మోసపోయాక లబోదిబోమంటూ బాధితులు పోలీసులను ఆశ్రయించక తప్పడం లేదు. తాజాగా మెట్ పల్లి పట్టణానికి చెందిన ఓ పిల్లల వైద్యుడు సైబర్ నేరగాళ్ల మాయలో పడి నిలు వు దోపిడీకి గురయ్యాడు. రూ. 72 లక్షలు పోగొట్టు కున్న సదరు బాధితుడు పోలీసులను ఆశ్రయించిన వైనం ఆలస్యంగా తెలిసింది. వైద్యుడికి స్టాక్ మార్కెట్ షేర్ మార్కెట్ లో పెట్టుబడిపెట్టడం అలవాటు. పలు మార్లు స్టాక్ మార్కెట్లో పెట్టుబడి పెట్టి అనేక మార్లు లాభాలు పొందాడు. ఇదే క్రమంలో 2024 మే 18న స్టాక్ మార్కెట్లో పెట్టుబడి పెట్టేందుకు ఇమ్లోకి వెళ్లి ఒక లింకును తెరిచాడు. ఆ వెంటనే వాట్సాప్ ఇన్వెస్ట్ చేయా లనుకుంటే ఏసీ మార్క్స్ అనే అప్లికేష ను న్ను డౌన్లోడ్ చేసుకొని అక్సెల్ స్టూడెంట్ సీ 95 గ్రూప్ లో చేరండి అంటూ ఒక లింక్ వచ్చింది. తన వాట్సాప్ లో వచ్చిన మెస్సేజ్ అనుకురిస్తూ లింక్ ఓపెన్ చేసి ఇన్వెస్ట్ చేయడం ప్రారంభించాడు. అదే నెల 22న రూ.50వేలు, 23న రూ. 50 వేలు చొప్పున ఇన్వెస్ట్ చేశాడు. పలు దఫాలుగా కలుపుకొని మొత్తం రూ.22 లక్షలు పెట్టుబడి పెట్టాక ఐపీఓ, సబ్ స్క్రైబ్ చేసుకోవాలని వాట్సాప్ కాల్స్ రావడం తో తన దగ్గర డబ్బులు లేవు, సబ్స్క్రైబ్ చేయలేనని బదులివ్వగా ఏం కాదు జమ చేసిన డబ్బులు సరిపోతా యనడంతో చెప్పడంతో నమ్మిన సదరు వైద్యుడు ఐపీఓ సబ్స్క్రైబ్ చేశాడు. ఆ వెంటనే రూ.50లక్షలు కట్టాలి లే దంటే క్రెడిట్ స్కోర్ పడిపోతుంది, లైఫ్ రిస్క్ పడిపోతుం దని, కనీసం ఫ్లైట్ ట్రావెల్ టికెట్ కూడా బుక్చేసుకోలేరు అని కాలర్ చెప్పడంతో తన వద్ద ఉన్న కొంత, అప్పు కొంత కలిపి రూ. 50 లక్షలు కట్టాడు. ఆ తర్వాత జూన్ 28న ఐపీఓలో పెట్టిన పెట్టుబడి లాభం రూ. 1.27 కోట్లకు పెరిగిందని మళ్లీ ఇంకొక ఐపీఓ సబ్ట్ చేసుకోవా లని వాట్సాప్ కాల్ వచ్చింది.

ఇక తన వద్ద డబ్బు లేద ని, సబ్రైట్ చేయలేనని బదులివ్వడంతో అలాగైతే 20 శాతం సర్వీసు టాక్స్ చెల్లించాలి, విత్ డ్రా చేసుకుంటే మొత్తంలో (రూ.1.27 కోట్ల) 30 శాతం డిపాజిట్ చేయాలని మెస్సేజ్ వచ్చింది. తాను మోసపోయినట్లుగా తెలుసుకున్న బాధితుడు వెంటనే గత నెల 4న సైబర్ క్రైమ్ విభాగానికి, అదే విధంగా స్థానిక పోలీస్టేషన్లో ఆదెనెల 13న ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.


# రుణమాఫీలో కాంగ్రెస్ దొంగ లెక్కలు

• 45 లక్షల మంది రైతులకు గాను 16లక్షలకే మాఫీ
• మాజీమంత్రి నిరంజన్ రెడ్డి విమర్శలు



**హైదరాబాద్ బ్యూరో, ప్రజానావ:** లక్షలోపు రుణం ఉన్న రైతులు గత ప్రభుత్వ హయాంలో 39 లక్షల మంది ఉ ంటే, ఆ సంఖ్య ఇప్పటికీ పెరిగి 45 లక్షలు అయింది. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం మొదటి, రెండు విడతల్లో కలిపి కేవలం 16 లక్షల మంది రైతులకే రుణమాఫీ చేసింది మరి మిగతా రైతుల రుణమాఫీ సంగతి ఏంటి..? అని మాజీమంత్రి నిరంజన్ రెడ్డి కాంగ్రెస్ సర్కార్ను నిలదీశారు. తెలంగాన రాష్ట్రం కోసం జరిగిన మలిదశ ఉద్యమానికి కేంద్ర బిందువు తెలంగాణ వ్యవసాయం అని రాష్ట్ర వ్యవసాయ శాఖ మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి గుర్తు చేశారు. వ్యవసాయానికి కావాల్సిన సాగునీరు, కరెంట్ ఇచ్చి రైతాంగాన్ని నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ గట్టెక్కించారని తెలిపారు. వ్యవసాయం మీద ఆధారపడి బతికే రైతులు గుండెమీద చేయి వేసుకుని నిద్రపోయే పరిస్థితిని నాటి సీఎం కేసీఆర్ తీసుకొచ్చారు. సహజ వనరులైన భూములను, వాటికి అవసరమైన జలాలు, కరెంట్, పెట్టుబడి వంటి సంపూర్ణ రక్షణ వలయాన్ని ఏర్పాటు చేశారు కేసీఆర్. దేశంలోని ఇతర రాష్ట్ర ప్రభుత్వాలు కూడా తెలంగాణ వ్యవసాయాన్ని కీర్తించాయి. ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ ఎంఎస్ స్వామినాథన్ కూడా తెలంగాణ వ్యవసాయం గొప్పగా ఉందని ప్రశంసించారు. నేను కలల కన్నట్లు తెలంగాణ వ్యవసాయం ఉందని స్వామినాథన్ అన్నారని నిరంజన్ రెడ్డి గుర్తు చేశారు. ముందేమో రైతు రుణాలు రూ. 40 వేల కోట్లు అని చెప్పి, చివరకు పత్రికా ప్రకటనల్లో రూ. 31 వేల కోట్లు.. చేశారని అన్నారు. భారతదేశంలోనే తొలిసారి సాహసం చేసి.. వ్యవసాయాన్ని గట్టెక్కిస్తే వారే పది మందికి ఉపాధి కల్పిస్తారనే మదనపడి తన మేధస్సును కరిగించి తెలంగాణ వ్యవసాయాన్ని బాగు చేశారు కేసీఆర్. అందులో భాగంగానే కేసీఆర్ రైతుల రుణాలను మాఫీ చేశారు. రైతుబంధు, రైతుబీమా వంటి పథకాలు ప్రవేశపెట్టారు. 39 లక్షల మంది రైతులకు రుణాలు మాఫీ చేశాం. మిగిలిన వారికి ఎన్నికల తర్వాత చేస్తామన్నాం కానీ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చింది. తెలంగాణ రైతాంగానికి ఎన్నికలు, ఓట్ల కోసం హోల్ సేల్ అబద్ధాలు చెప్పింది కాంగ్రెస్ పార్టీ. వారి మేనిఫెస్టోలో కూడా 2 లక్షల రుణమాఫీ డిసెంబర్ 9నాడు చేసి తీరుతామని చెప్పారు. అవసరమైతే రైతులు రుణాలు అర్జంట్గా తెచ్చుకోండని నేటి సీఎం రేవంత్ రెడ్డి నాడు చెప్పారు. ముందేమో రైతు రుణాలు రూ. 40 వేల కోట్లు అని చెప్పి, చివరకు పత్రికా ప్రకటనల్లో రూ. 31 వేల కోట్లు అని ప్రకటించారు. కాంగ్రెస్ పార్టీ డిసెంబర్ 9న రుణాలు మాఫీ చేస్తామని చెప్పి.. జులై నెలలో కేవలం 6 వేల కోట్లు మాత్రమే మాఫీ చేశారు. రైతుబీమా వచ్చిన తర్వాత సమిష్టిగా ఉండే కుటుంబాల్లో భూములు పంచుకుని వ్యవసాయం చేశారు. తెలంగాణ సర్కార్ దిగిపోయే నాటికి రైతుబంధు ఖాతాలు 69 లక్షల పైచిలుకు ఉంటే రుణాల తీసుకున్న సంఖ్య 60 లక్షల పైచిలుకు ఉంది. మరి ఈ 60 లక్షల పైచిలుకు రుణాలు పొంది ఉన్న రైతుల్లో 5 ఎకరాల్లోపు భూమి ఉన్న రైతుల సంఖ్య ఎక్కువ. తొంభై రెండున్న శాతం భూమి 5 ఎకరాల్లోపు ఉన్న రైతుల చేతుల్లో ఉంది. అటువంటప్పుడు లక్ష లోపు రుణం కలిగిన ఉన్న రైతుల సంఖ్య 39 లక్షలు ఉంటే.. ఇప్పుడు అది 40 నుంచి 45 లక్షల మధ్యలో ఉండాలి. మరి కాంగ్రెస్ ప్రభుత్వం మొదటి విడుతలో 11 లక్షలు, రెండో విడుతలో 5 లక్షల మంది రైతులకు మాత్రమే రుణాలు మాఫీ చేసింది. మరి మిగతా రైతులు ఎటు పోయారు..? రుణమాఫీకి అర్హులైన రైతుల సంఖ్యను జిల్లాలవారీగా ఎందుకు ఇవ్వడం లేదు. ఎందుకగోప్యంగా ఉంచుతున్నారు. మొదటి, రెండో విడుత కలిపి మీరు ఇచ్చినటువంటి డబ్బు రూ. 12 వేల కోట్ల చిల్లర మాత్రమే. మీరు చేసిన ఘనకార్యం ఏందన్నట్టు..? అని నిరంజన్ రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు.





## ఢిల్లీ మద్యం కేసులో కేజీవ్రాల్కు చుక్కెదురు

సీబీఐ అరెస్ట్ను సమర్థించిన కోర్టు

**న్యూఢిల్లీ:** మద్య విధానం కుంభకో ణంలో ఢిల్లీ సీఎం, ఆప్ కన్వీనర్ అరవింద్ కేజీవ్రాల్కు చుక్కెదురైంది. మద్యం విధానంలో అక్రమాలపై సీబీఐ అరెస్టును సమర్థించింది. తన అరెస్ట్ను సవాలు చేస్తూ కేజీవ్రాల్ పిటిషన్ దాఖలు చేయగా.. జస్టిస్ నీనా బన్సల్ కృష్ణ నేతృత్వంలోని ధర్మాసనం ఆ పిటిషన్ను కొట్టి వేసింది. సరైన కారణం లేకుండా అరెస్ట్ జరిగిందనడానికి తగిన ఆధారాలు లేవని పేర్కొంది. బెయిల్ కోసం చేసుకున్న దరఖాస్తునూ కొట్టి వేసింది. అయితే, బెయిల్ కోసం ట్రయల్ కోర్టుకు దరఖాస్తు చేసుకోవాలని సూచించింది. ఢిల్లీ మద్యం విధానం కేసులో మనీలాండరింగ్ ఆరోపణలపై తొలుత కేజీవ్రాల్ను ఎన్ఫోర్స్మెంట్ డైరెక్టరేట్ ఈ ఏడాది మార్చి 21న అరెస్ట్ చేసింది. ఈ కేసులో ఊరట లభించిన ప్పటికీ.. మద్యం విధానంలో అక్రమాలపై కేసు నమోదు చేసిన సీబీఐ.. తిహాడ్ జైల్లో కేజీవ్రా ల్ను సీబీఐ అరెస్ట్ చేసింది. మనీలాండరింగ్ కేసులో జులై 12న సుప్రీంకోర్టు మధ్యంతర బెయిల్ మంజూరై నప్పటికీ.. సీబీఐ కేసు కార ణంగా ఆయన ప్రస్తుతం కేజీవ్రాల్ జైల్లో ఉన్నారు.

## షాద్నగర్లో దళిత మహిళ కేసు

డిఐతో సహా ఐదుగురు కానిస్టేబుళ్ల సస్పెన్షన్

**హైదరాబాద్, ప్రజానావ:** షాద్నగర్ పట్టణ పోలీస్స్టేషన్లో సునీత అనే దళిత మహిళలను హింసించిన కేసులో ఉన్నతాధికారులు కఠిన చర్యలకు ఉపక్రమించారు. షాద్నగర్ డిటెక్టివ్ ఇన్స్పెక్టర్ (డీఐ) రామిరెడ్డితోపాటు మరో ఐదుగురు కానిస్టేబుళ్లను సస్పెండ్ చేశారు. ఈ మేరకు సైబరాబాద్ పోలీస్ కమిషనర్ అవినాశ్ మహంతి ఉత్తర్వులు జారీ చేశారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఈ కేసుపై దర్యాప్తు చేపట్టిన ఏసీపీ రంగస్వామి తన నివేదికను సీపీకి సమర్పించారు. నివేదిక ఆధారంగా బాధ్యులను గుర్తించి వారిని సస్పెండ్ చేసినట్లు సీపీ వెల్లడించారు. షాద్నగర్ దళితవాడలో నివసించే నాగేందర్ తన ఇంట్లో 22.5 తులాల బంగారం, రూ.2లక్షల నగదు చోరీ అయ్యాయంటూ జులై 24న పట్టణ పోలీస్స్టేషన్ లో ఫిర్యాదు చేయడంతో ఈ ఘటన చోటు చేసుకుంది. ఆయన ఎదురింట్లో భీమయ్య, సునీత (35) దంపతులు నివసిస్తున్నారు. కూలి పనులు చేసుకుంటూ జీవిస్తున్న ఈ దంపతులపై అనుమానంతో డీఐ రామిరెడ్డి 26న పోలీస్స్టేషన్కు పిలిపించారు. తాము చోరీ చేయలేదని వారు చెప్పడంతో ఇంటికి పంపేశారు. 30వ తేదీ రాత్రి 8.30 గంటల సమయంలో పోలీసులు మళ్లీ వచ్చి.. ఠాణాకు తీసుకొచ్చి తీవ్రంగా కొట్టారని బాధిత మహిళ సునీత ఆరోపించారు.

# సైన్యం చేతుల్లోకి బంగ్లాదేశ్

ప్రధానిని రాజీనామా చేయాలన్న ఆర్మీ చీఫ్
తప్పించుకుని ప్రవాసంలోకి వెళ్లిన ప్రధాని హసీనా



**ఢాకా:** బంగ్లాదేశ్లో చోటుచేసుకున్న హింసాత్మక ఘటనలతో పరిస్థితి చేజారింది. దాంతో సైన్యం రంగంలో దిగింది. దేశం మొత్తం దాని నియంత్రణలోకి వచ్చింది. ఆర్మీ చీఫ్ వాకర్–ఉజ్–జమాన్ దేశ ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తూ.. త్వరలో తాత్కాలిక ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. నిరసనకారులు హింసామార్గాన్ని విడనాడాలని పిలుపునిచ్చారు. దీనికి ముందు షేక్ హసీనా కు ఆర్మీ అల్టిమేటం ఇచ్చినట్లు తెలుస్తోంది. ఆమె పదవి నుంచి దిగిపోయేందుకు 45 నిమిషాల సమయం ఇచ్చినట్లు పలు వార్తా కథనాలు పేర్కొన్నాయి. ఈ క్రమంలో నే రాజీ నామా చేసి, సురక్షిత ప్రాంతానికి వెళ్లిపోయినట్లు సమా చారం. ఇదిలా ఉంటే.. త్రిపుర రాజధాని అగర్తలకు హసీ నా చేరుకున్నారని తెలుస్తుంది. అక్కడి నుంచి లండన్కు వెళ్లనున్నారని సమాచారం. ఈ పరిణామాల వేళ.. బం గ్లా దేశ్ ప్రధాని షేక్ హసీనా కుమారుడు సాజీద్ వాజెద్ జాయ్ ఫేస్బుక్లో పోస్టు పెట్టారు. అధికారాన్ని చేజిక్కించుకోవాల ని యత్నించే ప్రతిఒక్కరిని అడ్డుకోవాలని సైన్యాన్ని కోరారు. ప్రజలను, ఈ దేశాన్ని సురక్షితంగా ఉంచడం మీ బాధ్యత. ఎన్నిక కాని ప్రభుత్వం అధికారంలో కూర్చోవడా నికి ఒక్క నిమిషం కూడా అనుమతించొద్దు. ప్రధానిని గద్దె దించితే మనం సాధించిన అభివృద్ధి అంతా మట్టిలో పోసిన ట్టవు తుంది. తిరిగిమళ్లీ పుంజుకోలేదు. మనం అలాంటి పరిస్థి తిని కోరుకోం



అని ఫేస్బుక్లో పోస్టు పెట్టారు. ఆయన ప్రధానికి ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అడ్వైజర్గా పనిచేస్తున్నారు.

## వయనాడ్ సహాయక చర్యల్లో నటుడు పజ్రీశ్

ఇదే క్రమంలో ఆచూకీ లేకుండా పోయిన నటుడు

**వయనాడ్:** ప్రకృతి సృష్టించిన విలయానికి కేరళలోని వయనాడ్ అతలాకుతలమైంది. ఈ కఠిన సమయంలో కొందరు యువత ప్రాణాలకు తెగించి, సహాయక చర్యల్లో పాల్గొన్నారు. వారిలో పజ్రీశ్ కూడా ఒకరు. కొండచరియలు విరిగిపడటంతో చిక్కుకుపోయిన వారిని రక్షించేందుకు ప్రమాదాన్ని లెక్కచేయలేదు. ఎంతో మందిని కాపాడిన అతడి జాడ ఇప్పుడు తెలియకపోవడంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రకృతి విపత్తు గురించి తెలియగానే వయనాడ్లోని చూరాల్మల కు చెందిన పజ్రీశ్ రంగంలోకి దిగారు. తోటివారికి అవసరం అంటే ఏమాత్రం ఆలోచించకుండా సహాయం చేయడంలో ముందుంటారన్న పేరుంది. ముండక్కై ప్రాంతంలో కొండచరియలు విరిగిపడ్డా యని తెలియగానే, రక్షించేందుకు ప్రమాదకర కొండ ప్రాంత మార్గంలో జీప్లో వెళ్లారు. అలా రెండు సార్లు పలువురిని కాపాడారు. ఆ తర్వాత కుటుంబంతో కలిసి సురక్షిత ప్రాంతానికి వెళ్లేందుకు సిద్ధమయ్యారు. అంతలోనే సహాయం కోసం మరో ఫోన్ కాల్ వచ్చింది. దాంతో మళ్లీ అదే ప్రాంతానికి జీప్లో వెళ్లి తిరిగి రాలేదు. చూరాల్మల ప్రాంతంలో ధ్వంసమైన జీప్ కనిపించింది. కానీ అతడి జాడ మాత్రం తెలియరాలేదని స్థానికులు వెల్లడించారు. పజ్రీశ్ అంటే అందరికీ ఇష్టం. మా ఇళ్లలో ఎలాంటి కార్యక్రమమైనా ముందుండి తనవంతు సహకారం అందిస్తాడు. నా కుమార్తె పెళ్లికి అతడు చేసిన సహా యం మరువలేనిది‘ అని మరొకరు తెలిపారు. ఆ కొండ ప్రాంతానికి వెళ్లొద్దని చెప్పినా వినలేదని పజ్రీశ్ స్నేహితులు వెల్లడించారు. కొండచరియలు విరిగిపడటంతో ముండక్కై, చూరాల్మల ప్రాంతా ల్లో వంద లాది ఇళ్లు తుడిచిపెట్టుకుపో యాయి. ఆదివారం సాయంత్రం వరకు 222 మృతదేహాలను వెలికితీశారు. ఆచూకీ గల్లంతైనవారి సంఖ్య 180 వరకూ ఉంటుందని అధికారులు తెలిపారు.



రాజన్న ఆలయ భక్తుల సౌకర్యార్థం సోమవారం ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ఆలయ ఈవో వినోద్ రెడ్డి బ్రేక్ దర్శనాన్ని ప్రారంభించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో స్థానిక ఆర్డీఓ రాజేశ్వర్ బ్రేక్ దర్శనం కౌంటర్‌ను పరిశీలించి, ప్రొటోకాల్ పర్యవేక్షకుడు సిరిగిరి శ్రీరాములును వివరాలు అడిగి తెలుసుకున్నారు. తొలిరోజు 96 మంది బ్రేక్ దర్శనం ద్వారా స్వామివారిని దర్శించుకోగా, రూ.28,800 ఆదాయం సమకూరింది. వీరి వెంట ఈఓ సీసీ ఎడ్ల శివ, పొలిసాని రాజు తదితరులున్నారు.

– వేములవాడ, ప్రజానావ



నిర్మల్ ఎమ్మెల్యే, బీజేపీ అసెంబ్లీ ఫ్లోర్ లీడర్ ఏలేటి మహేశ్వర్ రెడ్డి సోమవారం వేములవాడ రాజన్నను కుటుంబసమేతంగా దర్శించుకున్నారు. అంతకుముందు కోడె మొక్కును చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దంపతులకు నాగిరెడ్డి మండపంలో ఆలయ అర్చకులు వేదొక్త ఆశీర్వచనం చేశారు. వీరి వెంట ప్రొటోకాల్ పర్యవేక్షకుడు సిరిగిరి శ్రీరాములు, ఆలయ పర్యవే క్షకుడు అలి శంకర్, సంకపల్లి పవన్, శ్రీనివాస్ రెడ్డి, బిజెపి జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ, రేగుల మల్లికార్జున్ తదితరులున్నారు.

– వేములవాడ, ప్రజానావ

## బీజేపీ నాయకుల మాటలు అర్ధరహితం

- రాజన్న ఆలయ అభివృద్ధికి రూ.50కోట్లు కేటాయించిన ఘనత కాంగ్రెస్‌దే
- పట్టణ, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు చంద్రగిరి శ్రీనివాస్ గౌడ్, సాగరం వెంకటస్వామి



**వేములవాడ, ప్రజానావ:** ఇటీవల జరిగిన బడ్జెట్ సమావేశాల్లో రాజన్న ఆలయ అభివృద్ధికి తొలిసారిగా రూ.50కోట్లు కేటాయించిన ఘనత కాంగ్రెస్ పార్టీకే దక్కుతుందని వేములవాడ పట్టణ కాంగ్రెస్ నాయకులు స్పష్టం చేశారు. రాష్ట్ర బడ్జెట్‌లో రాజన్న ఆలయ అభివృద్ధికి నిధులు కేటాయించడం లేదని ఆరోపిస్తూ ఇటీవల బీజేపీ నాయకులు తెలిపిన నిరసన కార్యక్రమాన్ని వ్యతిరేకిస్తూ సోమవారం వేములవాడ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు చంద్రగిరి శ్రీనివాస్ ఆధ్వర్యంలో తెలంగాణ చౌక్ వద్ద సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో పాటు మంత్రులు పొన్నం ప్రభా కర్, శ్రీధర్ బాబు, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ల చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లా డుతూ రాజన్న ఆలయ అభివృద్ధి, బడ్జెట్ విష యంలో బీజేపీ నాయకులు చేసిన వ్యాఖ్యలన్నీ అర్ధరహితంగా ఉన్నాయని, ఆలయ అభివృద్ధికి చరిత్రలోనే ఎన్నడు లేని విధంగా రూ.50కోట్లు నిధులు కేటాయించిన ఘనత కాంగ్రెస్ పార్టీకి, సీఎం రేవంత్ రెడ్డికే దక్కిందన్నారు. గత పదేండ్లుగా అధికారంలో ఉన్నప్పటికీ రాజన్న ఆలయాన్ని ప్రసాద్ స్కీములో చేర్చకుండా ఆలయ అభివృద్ధిపై వివక్ష చూపింది బీజేపీనేనని మండిపడ్డారు. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వం లో, ప్రభుత్వ విప్, స్థానిక శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ సహకారంతోనే రాజన్న ఆలయంతో పాటు వేములవాడ నియోజకవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందని, బీజేపీ నాయకులు ఈ విషయాన్ని గమనించి, వారు చేసిన వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## టేకు కలప పట్టివేత

### అధికారులపై దాడికి దిగిన దుండగులు



**చందుర్తి, ప్రజానావ:** రాజన్న సిరిసిల్ల జిల్లా చందుర్తి మండలం లింగంపేట గ్రామ శివారులో టేకు కలపను ఫారెస్ట్ అధికారులు పట్టుకున్నారు. ఈ క్రమంలో దుండగులు అధికారులపై దాడికి దిగినట్లు చందుర్తి బీట్ ఆఫీసర్ రాజశేఖర్ తెలిపారు. లింగంపేట గ్రామ స్థానికుల నమ్మదగిన సమాచారంతో టేకు కలపను పట్టుకోవడం జరిగిందని తెలిపాడు. దాడికి యత్నించడంతో బీట్ ఆఫీసర్ డయల్ 100 కు కాల్ చేయడంతో పోలీసు వారు ఘటన స్థలానికి చేరుకున్నారని, వారి సహాయంతో పట్టుకున్న కలపను లింగంపేట గ్రామ పంచాయతీలో భద్రపరిచామని అన్నారు. ఫారెస్ట్ సిబ్బందిపై దాడికి పాల్పడిన వారిపై కేసు నమోదు చేస్తామని ఫారెస్ట్ సిబ్బంది రాజశేఖర్ తెలిపారు.

# టీటీడీ తరహా వీటీడీఏ

- రాజన్న ఆలయంలో ప్రారంభమైన బ్రేక్ దర్శనం
- త్వరలోనే ఆలయ విస్తరణ పనులు ప్రారంభం
- ఆధ్యాత్మిక చింతన ఉట్టిపడేలా అభివృద్ధి చేస్తాం
- ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్



**వేములవాడ, ప్రజానావ :** రాజన్న ఆలయంలో తొలిసారిగా బ్రేక్ దర్శనాలను అందుబాటులోకి తెచ్చినట్లు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ తెలిపారు. శ్రావణమాసం మొదటి సోమవారంను పురస్కరించుకుని ఆలయంలో ఒక్కొక్కరికి రూ.300 టికెట్ పై భక్తులకు బ్రేక్ దర్శనాలను ప్రారంభించి మాట్లాడారు. యాదాద్రి, తిరుమల తిరుపతి దేవస్థానాల తరహాలో వేములవాడ రాజన్న ఆలయంలో వీఐపీలు, భక్తులకు త్వరగా స్వామి వారి దర్శనం కలిగేలా ఈ అవకాశాన్ని కల్పించినట్లు పేర్కొన్నారు. గత పాలకులు రాజన్న ఆలయానికి బడ్జెట్లో రూ.100 కోట్లు ఇస్తామని మోసం చేస్తే తమ ప్రభుత్వం ఏర్పడిన మొదటి మూడు నెలల్లోనే వీటీడీఏ సమావేశం ఏర్పాటు చేసి వెనక్కి మళ్లిన రూ.20కోట్లను తీసుకొచ్చామన్నారు. ఈసారి బడ్జెట్లో ఆలయ అభివృద్ధికి రూ.50కోట్లు కేటాయించిన విషయాన్ని గుర్తు చేశారు. త్వరలోనే దేవాదాయశాఖ అధికారులు రాజన్న ఆలయానికి చేరుకుని అంచనాలకు అనుగుణంగా ఆలయ విస్తీర్ణం చేపడతారని తెలిపారు. ఇటీవల శృంగేరి పీఠానికి వెళ్లిన సందర్భంలో రాజన్న ఆలయం అభివృద్ధి, విస్తరణపై చర్చించినట్లు పేర్కొన్నారు. ఆధ్యాత్మిక చింతన ఉట్టిపడేలా ఆలయాన్ని అభివృద్ధి చేస్తామన్నారు. మిగతా భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు ప్రతిరోజు ఉదయం 10.15 నుంచి 11.15 గంటల వరకు, సాయంత్రం నాలుగు 4 నుంచి 5 గంటల వరకు బ్రేక్ దర్శనాలు కొనసాగనున్నాయన్నారు. ఇందుకు ఒక్కో భక్తుడు రూ.300 చెల్లిస్తే ఈ– టికెట్ అందజేస్తారని, ఒక్కో టికెట్‌పై ఒక లడ్డూ ఉచితంగా అందజేస్తామన్నారు. కోడె టికెట్ సైతం అదనంగా రూ.200 చెల్లిస్తే ఇక్కడే ఇచ్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. మొత్తంగా రూ.500 చెల్లిస్తే బ్రేక్ దర్శనం, కోడెటికెట్ అందజేస్తామని ఈవో కొప్పుల వినోదెడ్డి తెలిపారు. ఆలయంలో భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా పారిశుధ్య నిర్వహణ, మంచినీటి వసతి, ఇతర సౌకర్యాలు కల్పిస్తామన్నారు. ఈఈ రాజేశ్, డీఈ రఘునందన్, మున్సిపల్ వైస్ చైర్మన్ బింగి మహేశ్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



## వేములవాడలో స్వచ్ఛదనం.. పచ్చదనం

### మున్సిపల్ చైర్మన్ తో కలిసి పరిసరాలు శుభ్రంచేసిన ప్రభుత్వ విప్

**వేములవాడ, ప్రజానావ:** రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ పట్టణంలోని సినారె కళా మందిరంలో సోమవారం నిర్వహించిన స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అంతకుముందు తెలంగాణ చౌక్ నుంచి బద్ది పోచమ్మ దేవాలయం వరకు ర్యాలీ తీశారు. అనంతరం మున్సిపల్ చైర్మన్ తో కలిసి ప్రభుత్వ విప్ పరిసరాలు పరిశుభ్రం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వచ్ఛదనం.. పచ్చదనం కార్యక్రమం వేములవాడ పట్టణం లో ప్రారంభించుకోవడం సంతోషంగా ఉందన్నారు. ప్రజల జీవన ప్రమాణాలను పెంపొందించుకునేందుకు ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. గ్రామాల్లో అడవులు అంతరించిపోవడం, పట్టణంలో చెట్లు నశించి పోవడంతో వాతావరణంలో కార్బన్‌డైఆక్సైడ్ స్థాయి పెరిగే ప్రమాదం ఉందన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకొని ప్రతి ఒక్కరూ మొక్కలు నాటే కార్యక్రమాన్ని బాధ్యతగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఇక టెంపుల్ సిటీ అభివృద్ధిలో అందరూ భాగస్వామ్యం కావాలని కోరారు. వేములవాడ పట్టణ అభివృద్ధిలో ఎక్కడా రాజీపడేది లేదని, రానున్న రోజుల్లో అన్ని హామీ లను అమలు చేస్తామని స్పష్టం చేశారు. ఇప్పటికే రైతుల కు ఏకకాలంలో రుణమాఫీ చేశామని, రాజన్న ఆలయ అభివృద్ధికి బడ్జెట్లో రూ.50 కోట్లు కేటాయించడం జరిగిందని గుర్తుచేశారు. శ్రీపాద ప్రాజెక్టుకు రూ.320 కోట్లు నిధులు మంజూరు చేసినట్లు వివరించారు. రాజకీయాలకు అతీతంగా నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసుకుందామని, ప్రజలకు పాలకుడిగా కాకుండా సేవకుడి ఉంటానని పేర్కొన్నారు.

**వార్డుల్లో ర్యాలీ..**

పట్టణంలోని 7, 8 వార్డుల్లో (తిప్పాపురం, ప్రభుత్వ పాఠశాల) స్వచ్ఛదనం పచ్చదనం ప్రాముఖ్యతను వివరిస్తూ



ర్యాలీ తీశారు. ఈ ర్యాలీ ప్రభుత్వ పాఠశాల నుంచి ప్రారంభమై ప్రధాన వీధుల గుండా, తిప్పాపురం ప్రధాన బస్టాండ్.. గ్రామ పంచాయతీ మీదుగా ర్యాలీ సుమారు రెండు వార్డుల్లో నాలుగు కిలోమీటర్ల పాటు గంట సేపు కొనసాగింది. ఈ సందర్భంగా తడి, పొడి చెత్తను వేరే చేయాలని, మున్సిపల్ వాహనాలకే చెత్త ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర మున్సిపాలిటీ డిప్యూటీ డైరెక్టర్ సాయినాథ్, నగర కమిషనర్ అన్వేష్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. స్వచ్ఛతనం పచ్చదనం ఇంటిల్లిపాదిని రక్షిస్తుందని, ఈ నెల 9వరకు ఈ ప్రత్యేక కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, ప్రభుత్వ విభాగాల అధికారులు పాల్గొంటున్నారని ప్రజలంతా చైతన్యవంతులై చెత్తరహిత నగరంగా మార్చాలన్నారు.

## సిరిసిల్లలో రోడ్డెక్కిన న్యాయవాదులు

**సిరిసిల్ల, ప్రజానావ:** సివిల్ కేసులను పోలీసులు అనవసరంగా క్రిమినల్ కేసులుగా మారుస్తున్నారని ఆరోపిస్తూ సిరిసిల్లలో న్యాయవాదులు పాదయాత్ర చేస్తూ నిరసన తెలిపారు. ఈ పాదయాత్ర జిల్లా కోర్టు నుంచి ప్రెస్‌క్లబ్ వరకు సాగింది. అనంతరం ప్రెస్‌క్లబ్‌లో న్యాయవాదులు మీడియాతో మాట్లాడారు. కక్షిదారుకు కోర్టు ఇచ్చిన ఆర్డర్‌ను తుంగలో తొక్కి దాన్ని పట్టించుకోకుండా కోర్టు ఇచ్చిన ఉత్తర్వుదారుపై క్రిమినల్ కేసులు పోలీసులు పెడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. గత ఐదు రోజులుగా కోర్టు విధులు బహిష్కరించినప్పటికీ పోలీసు శాఖలో ఎలాంటి చలనం లేదని వాపోయారు. ఇకనైనా పోలీసు ఉన్నతాధికారులు స్పందించి సివిల్ కేసుల్లో జోక్యం చేసుకోకుండా చట్టాన్ని, కోర్టును గౌరవించాలని కోరారు. లేదంటే న్యాయం చేసేదాకా కోర్టు విధులు బహిష్కరిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో అధ్యక్షుడు దోర్నాల సంజీవరెడ్డి, ప్రధాన కార్యదర్శి తంగళ్లపల్లి వెంకటి, సీనియర్, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

## టి-సాట్ ప్రత్యేక పాఠాలు

**ఖైరతాబాద్, ప్రజానావ:** గ్రూప్–1 మేయిన్స్ పరీక్ష రాసే అభ్యర్థుల కోసం టి–సాట్ ప్రత్యేక పాఠాలు ప్రసారం చేయనుంది. ఇప్పటికే ప్రిలిమ్స్ పరీక్ష రాసే అభ్యర్థుల కోసం ప్రత్యేక అవగాహన పాఠ్యాంశాలు అందించిన టి–సాట్ మేయిన్స్ అభ్యర్థుల కోసమూ 750 ఎపిసోడ్స్ సిద్ధం చేసింది. టి–సాట్ సీఈవో బోదనపల్లి వేణుగోపాల్ రెడ్డి ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. తెలంగాణ ప్రభుత్వం టీజీపీయస్సీ ఆధ్వర్యంలో ప్రతిష్టాత్మకంగా నిర్వహించే అనేక పోటీ పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులకు వెన్నుదన్నుగా నిలిచిన టి–సాట్ గ్రూప్–1 మేయిన్స్ అభ్యర్థులకూ పూర్తి స్థాయిలో అండగా నిలువనుందని సీఈవో హామీ ఇచ్చారు. మరో మూడు నెలల్లో జరగనున్న గ్రూప్–1 మేయిన్స్ పరీక్షకు సైతం అదే ప్రోత్సాహాన్ని టి–సాట్ అందిస్తోందని, పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సీఈవో సూచించారు. లక్షల రూపాయలు వెచ్చించి కోచింగ్ సెంటర్లకు వెళ్లకుండా ఇంటి వద్దే ఉండి టి–సాట్ అందించే ప్రసారాల ద్వారా నిరుద్యోగ యువత మంచి ఫలితాలు సాధించవచ్చని సీఈవో వేణుగోపాల్ రెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు.

## గ్రీవెన్స్ డేలో 14 ఫిర్యాదులు

### రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్

**సిరిసిల్ల, ప్రజానావ:** ఎస్పీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్ డేలో 14 ఫిర్యాదులు వచ్చినట్లు ఎస్పీ అఖిల్ మహాజన్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాధితులకు సత్వర న్యాయం చేయడానికి ప్రతి సోమవారం గ్రీవెన్స్ డే కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. అర్జీదారుల నుంచి 14 ఫిర్యాదులు స్వీకరించి ఆయా పోలీస్ స్టేషన్ల అధికారులకు ఫోన్ చేసి బాధితుల సమస్యలను చట్టపరంగా పరిష్కరించాలని ఆదేశించారు. భూ తగాదాలు, ఆస్తి తగాదాల విషయంలో చట్ట ప్రకారం, నిబంధనలకు అనుగుణంగా నడుచుకుంటూ బాధితులకు సత్వర న్యాయం అందించే విధంగా చూడాలని సూచించారు. ఫ్రెండ్లీ పోలీసింగ్ నిర్వహిస్తూనే అసాంఘిక శక్తులు, నేరస్థుల పట్ల కఠిన వైఖరి అవలంబిస్తూ శాంతి భద్రతల సమస్య తలెత్తకుండా చూస్తామన్నారు. గ్రీవెన్స్ డే ద్వారా ప్రజలు నేరుగా తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావడం ద్వారా సాధ్యమైనంత త్వరగా వాటిని పరిష్కరించేలా చూస్తామని ఎస్పీ తెలిపారు.





# అనుమానాస్పద రిజిస్ట్రేషన్లపై కలెక్టర్లు విచారణ జరిపించాలి

## ఏపీలో రెవెన్యూ రికార్డుల భద్రతపై ఆర్పీ సిసోడియా ఆందోళన

**అమరావతి, ప్రజానావ:** సచివాలయంలో కలెక్టర్ల సదస్సు కొనసాగుతోంది. రెవెన్యూ శాఖపై స్పెషల్ సీఎస్ ఆర్పీ సిసోడియా పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ సందర్భంగా రెవెన్యూ రికార్డుల భద్రతపై ఆయన ఆందోళన వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా ఆయన కీలక వ్యాఖ్యలు చేశారు. "అనుమానాస్పద రిజిస్ట్రేషన్లపై కలెక్టర్లు విచారణ జరిపించాలి. రెవెన్యూ కార్యాలయాల్లో భూ రికార్డులు భద్రపరచాలి. సబ్ కలెక్టర్ కార్యాలయాల్లో డాక్యుమెంట్లు జాగ్రత్త చేయాలి. చాలా కార్యాలయాల్లో సీసీ కెమెరాలు కూడా లేవు. క్షేత్రస్థాయి పిటిషన్లు సీఎం వద్దకు వస్తే కలెక్టర్లు విఫలమైనట్లే. రికార్డులు భద్రపరిచే విషయంలో పోలీసుల సహకారం తీసుకోవాలి" అని కలెక్టర్లకు సూచించారు. "ప్రజల నుంచి వస్తున్న ఫిర్యాదుల్లో చాలా వరకు రెవెన్యూశాఖవే భూములు లాగేసుకున్నారనే ఫిర్యాదులే ఎక్కువగా వస్తున్నాయి. పత్రాలు తమ వద్దే ఉన్నా.. భూ వివాదంలో ఉన్నట్టు ఫిర్యాద.. చేస్తున్నారు. కలెక్టర్లు, ఎస్పీలు భూ సమస్యలపై దృష్టిసారించాలి. కలెక్టర్లపై విశ్వాసం సన్నగిల్లకుండా చూసుకోవాలి. కలెక్టర్లు అందుబాటులో ఉండట్లేదు.. కలవట్లేదనే ఫిర్యాదులు ఉన్నాయి. రాష్ట్రవ్యాప్తంగా 13.59 లక్షల ఎకరాలు ఫ్రీ హోల్డ్ చేశారు. వీటిలో 25,230 ఎకరాలు రిజిస్ట్రేషన్లు అయిపోయాయి. సేల్, గిఫ్ట్, తనఖా పేర్లతో అనుమానాస్పద రిజిస్ట్రేషన్లు చేశారు. అనుమానాస్పద రిజిస్ట్రేషన్లపై కలెక్టర్లు విచారణ చేయాలి. అనర్హులకు అసైన్డ్ భూములు కట్టబెట్టారు. కొందరికి తక్కువ దరకే ఇచ్చారు" అన్నారు.

### నెల రోజుల్లో మద్యం దుకాణాల్లో డిజిటల్ చెల్లింపులు : ఎంకే మీనా

ఎక్సైజ్ శాఖ ముఖ్య కార్యదర్శి ఎంకే మీనా పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఎన్డీపీఎల్ లిక్కర్ రాష్ట్రంలోకి రాకుండా నిఘా పెట్టాలన్నారు. "ఇతర రాష్ట్రాల సరిహద్దులు ఉన్న జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు మరింత నిఘా పెట్టాలి. ఎన్నికల వేళ అక్రమ మద్యం ఎక్కడికి వెళ్లిందో అందరూ చూశారు. నెల రోజుల్లో మద్యం దుకాణాల్లో డిజిటల్ చెల్లింపుల విధానం వస్తుంది" అన్నారు.

### దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలి: హిమాన్షు శుక్లా

పౌరసంబంధాల శాఖపై ఐ అండ్ పీఆర్ డైరెక్టర్ హిమాన్షు శుక్లా ప్రజెంటేషన్ ఇచ్చారు. వార్తల విశ్లేషణ కోసం ఏఐ టూల్సు సీఎంకు చూపించారు. "సమాచార యుద్ధం ఫీల్డ్ నుంచి ఫీడ్ వరకు వచ్చింది. దుష్ప్రచారాన్ని సమర్థంగా తిప్పికొట్టాల్సిన అవసరం ఉంది. ఏది నిజం.. ఏది దుష్ప్రచారం అనేది ప్రజలకు తెలపాలి. జిల్లా స్థాయిలో మీడియా మానిటరింగ్ టీమ్లు ఉండాలి. ప్రభుత్వంపై దుష్ప్రచారం జరిగితే తిప్పికొట్టే వ్యవస్థ ఉండాలి" అన్నారు.

# మనమంతా కష్టపడితే 2047నాటికి నంబర్ వన్

## కలెక్టర్ల సదస్సులో సీఎం చంద్రబాబు



**అమరావతి, ప్రజానావ:** గత ప్రభుత్వ ఐదేళ్ల విధ్వంస పాలనతో అందరూ నష్టపోయారని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. లక్ష్యాలకు అనుగుణంగా అధికారులంతా ముందుకెళ్లాల్సిన అవసరముందని చెప్పారు. వెలగపూడి సచివాలయం లో నిర్వహించిన జిల్లా కలెక్టర్ల సదస్సులో సీఎం మాట్లాడారు. "మనం తీసుకునే నిర్ణయాల వల్ల వ్యవస్థలే మారే పరిస్థితి ఉంటుంది. మంచి నిర్ణయాలు తీసుకుంటే భవిష్యత్తు తరాలకు మేలు జరుగుతుంది. మనమంతా కష్టపడితే 2047 నాటికి ప్రపంచంలోనే మనం నంబర్ వన్గా ఉంటాం. ఈ కలెక్టర్ల సదస్సు చరిత్ర తిరగరాయబోతోంది. ప్రజావేదికలో ఆనాటి సీఎం కలెక్టర్ల సదస్సు పెట్టి కూల గొట్టేశారు. విధ్వంసంతో పాటు పనిచేసే అధికారులను పక్కనబెట్టారు.. బ్లాక్ మెయిల్ చేశారు. బ్రాండ్ ఏపీని దెబ్బతీసేలా గత ఐదేళ్ల పాలన సాగింది. ఒకప్పుడు ఆంధ్రా అధికారులంటే ఢిల్లీలో ఒక గౌరవం ఉండేది. ఇప్పుడు చులకన భావం కలిగే పరిస్థితిని తీసుకొచ్చారు. రాష్ట్ర పునర్నిర్మాణానికి అధికారులంతా అంకితం కావాలి" అని చంద్రబాబు పిలుపునిచ్చారు.

### ప్రతి నెలా ఒకటో తేదీన 'పేదల సేవలో'..

పేదరిక నిర్మూలనకు ఎన్డీయే కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని సీఎం చంద్రబాబు అన్నారు. ప్రతి నెలా ఒకటో తేదీన 'పేదల సేవలో' కార్యక్రమంలో అధికారులు పాల్గొని ప్రజలతో అన్నారు. ప్రతి నెలా ఒకటో తేదీన 'పేదల సేవలో కార్యక్రమంలో అధికారులు పాల్గొని ప్రజలతో మమేం కావాలని దిశానిర్దేశం చేశారు. పేదరిక నిర్మూలనకు వినూత్న ఆలోచనలతో కలెక్టర్లు ముందుకు రావాలన్నారు. పార్టీ ఆఫీస్ కి వెళ్లేటపుడు పెద్ద ఎత్తున ప్రజల నుంచి ఫిర్యాదులు అందుతున్నాయని.. 5వేల ఫిర్యాదుల్లో సగం భూ సమస్యలే ఉన్నాయని చెప్పారు. జగన్ పాలనలో పెద్ద ఎత్తున భూ కబ్జాలు, అవకతవకలు జరిగాయన్నారు. సర్వే రాళ్లు, పట్టాదారు పాసు పుస్తకాలపై జగన్ ఫొటో వేసుకోవాలన్న దుర్మార్గపు ఆలోచన గతంలో చూశామని వివరించారు.

### రీచ్ నుంచి తక్కువ ఛార్జీతో ఇసుక వచ్చేలా చేయాలి..

ఇసుక, మైనింగ్ వ్యవహారాల్లో ఇబ్బందులు తొలగించాలని అధికారులకు సీఎం సూచించారు. ఉచిత ఇసుక విధానం అమల్లో ప్రజలకు ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. "కేవలం ఇసుక తవ్వకం, రవాణాకే ఛార్జీలు వసూలు చేయాలి. రవాణా ఛార్జీలు పెరగకుండా అతి దగ్గరగా ఇసుక రీచ్ పెట్టాలి. ఎప్పటికప్పుడు రవాణా ధర ప్రజలకు తెలియాలి. అధికారులెవరైనా సరైన నిర్ణయం తీసుకోకపోతే వారిని అక్కణ్నుంచి తప్పిస్తా.. సచివాలయంలో ఇసుక బుకింగ్ చేస్తే రవాణా ఛార్జీలే చెల్లించేలా ఉండాలి. ఇసుక రీచ్ నుంచి ఇంటి వరకు తక్కువ ఛార్జీతో ఇసుక వచ్చేలా ఉండాలి. ప్రభుత్వానికి చెడ్డపేరు తెచ్చేలా వ్యవహరించవద్దు. సహజ వనరుగా వచ్చిన ఇసుకను ఇష్టానుసారంగా దోపిడీ చేశారు. సుప్రీంకోర్టు చెప్పినా మభ్యపెట్టే ప్రయత్నం చేశారు. ఇసుక విషయంలో చాలా అక్రమాలు జరిగాయి. వాటిపై సీఐడీ విచారణ చేస్తున్నాం. నిందితులను శిక్షిస్తాం. భూగర్భ జలాలను పెంచుకునేలా మనం ప్రయత్నం చేయాలి. చెక్ డ్యామ్లకు మరమ్మతులు చేయాలి. ముందుగా అన్ని రిజర్వాయర్లు, చెరువులను పూర్తిగా నింపండి. గత ప్రభుత్వం గేట్ల మరమ్మతులకు డబ్బులివ్వకుండా నిర్లక్ష్యం చేసింది" అని చంద్రబాబు అన్నారు.

### 80 శాతం రెవెన్యూ సమస్యలే: మంత్రి అనగాని

ప్రజల నుంచి వస్తున్న సమస్యల్లో 80 శాతం రెవెన్యూ సంబంధిత అంశాలేనని మంత్రి అనగాని సత్యప్రసాద్ అన్నారు. ఆ శాఖను ప్రక్షాళన చేయాల్సిన అవసరముందని చెప్పారు. స్వార్థం కోసం గత పాలకులు ఎన్నో అరాచకాలు చేశారన్నారు. అన్ని వ్యవస్థలు దెబ్బతిన్నాయని తెలిపారు. నిర్వీర్యమైన వ్యవస్థలను చక్కదిద్దాల్సిన అవసరముందన్నారు. ప్రజల హక్కులన్నీ నిర్వీర్యం చేసే ల్యాండ్ టైట్లింగ్ చట్టాన్ని రద్దు చేసిన విషయాన్ని మంత్రి గుర్తు చేశారు. అన్న క్యాంటీన్లను పునరుద్ధరించ బోతున్నట్లు చెప్పారు.

# యువతిపై ప్రేమోన్మాది దాడి



**గుంటూరు, ప్రజానావ:** ప్రేమోన్మాది యువతి పైదాడికి పాల్పడిన సంఘటన గుంటూరు జిల్లా తాడేపల్లి ఎయిమ్స్ కు వెళ్లే రహదారి సమీపంలో ఆదివారం చోటుచేసుకుంది. తాడే పల్లి పోలీసులు వివరాల ప్రకారం.. జాతీయ రహదారి ఎయిమ్స్ రోడ్డు వద్ద ప్రేమోన్మాది యువతిని బ్లేడ్తో గొంతు కోసేందుకు ప్రయత్నించాడని తెలిపారు. గొంతుపై గాయాలు కాగా యువతి అప్రమత్తం కావటంతో ప్రాణాపాయం నుంచి బయటపడింది. ఘటనా స్థలంలో ఉన్న స్థానికులు అడ్డుపడి నిందితులను పట్టుకుని తాడేపల్లి పోలీసులకు అప్పగించారు. బాధితురాలని చికిత్స నిమిత్తం మణిపాల్ ఆస్పత్రికి తరలించారు. అవనిగడ్డకు చెందిన బాధితురాలు ఓ ప్రైవేట్ వైద్యశాలలో నర్సుగా పనిచేస్తున్నట్లు సమాచారం. అయితే గత కొంతకాలంగా విజయవాడకు చెందిన క్రాంతి అనే యువకుడు ప్రేమిస్తున్నానని చెప్పి ఆమె వెంట పడుతున్నట్లు తెలిపారు. అయితే ఆమె అతని ప్రేమను తిరస్కరించడంతో బ్లేడుతో చంపటానికి ప్రయత్నించాడని సమాచారం. స్థానికులు అప్రమత్తం కావడంతో యువతి ప్రాణాలతో బయటపడింది. తాడేపల్లి పోలీసులు ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# సైబర్ నేరాలపై సీపీ నజర్



**విజయవాడ, ప్రజానావ:** నేరాలు జరిగిన తర్వాత దర్యాప్తు కంటే జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా నేరాలకు అడ్డుకట్ట వేయొచ్చని విజయవాడ పోలీస్ కమిషనర్ ఎస్.వి రాజ శేఖర్ బాబు తెలిపారు. సమాజంలో వివిధ రకాల సైబర్ నేరాలు జరుగుతూ ఉంటాయని అవి జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా సైబర్ నేరాలకు అడ్డుకట్ట వెయవచ్చని తెలిరారు. సైబర్ నేరాల పట్ల ప్రతి ఒక్కరికి అవగాహన కల్పిస్తే ఆ నేరాల బారిన పడకుండా ఉంటారని అన్నారు. ఈ సైబర్ నేరాలను అంతం చేయాలనే ప్రధాన ఉద్దేశ్యంతో సీపీ ఆధ్వర్యంలో పోలీస్ కమీషనరేట్ పరిదిలోని పోలీస్ సిబ్బందిని, మహిళా పోలీసులను సైబర్ కమాండోలుగా ఏర్పాటు చేశారు.

ప్రజలలో చైతన్యం తీసుకు వచ్చేందుకు వినూత్న పద్దతిలో ముందుకు పోవడానికి ఈ సైబర్ కమాండోలను ఏర్పాటు చేసినట్లు సీపీ తెలిపారు. ఇప్పటికే కమీషనరేట్ పరిదిలో అన్ని కళాశాలలో విద్యార్ధులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించి వారిలో ఆసక్తి కలిగిన వారిని సైబర్ సోల్జర్స్గా నమోదు చేశారు. ప్రతి సైబర్ కమాండోకు 10-15 మంది సోల్జర్స్ను ఇవ్వడం జరుగుతుందని ఆ కమాండోలు సోల్జర్స్ కు గైడ్ చేస్తూ వారు ఎక్కువ మంది ప్రజలను సైబర్ సిటిజన్లుగా మార్చే విధంగా చర్యలు తీసుకోవాలని సీపీ సూచించారు. కమాండోలకు సైబర్ నేరాలు అనేవి ఆన్ లైన్ లో గేమ్స్, ఆన్ లైన్ లోన్స్, క్యూఆర్ కోడ్ స్కాన్ చేయడం, పార్ట్ టైం జాబ్స్ అంటూ వాట్సాప్ ద్వారా, పేస్ బుక్, ఇన్స్టాగ్రామ్, ట్విట్టర్, టెలిగ్రాం మొదలైన యాప్ల ద్వారా ఫేక్ ఐడీలు, మెసేజ్ రూపంలో వచ్చే లింకులు, బ్యాంక్ కేవైసీ అప్డేట్, ఓఎల్ఎక్స్ నుంచి ఆర్మీ అధికారులము అని చెప్పి తక్కువ రేట్కు వస్తువులు అమ్ముతున్నట్లు చూపించడం, దిల్లీ, ముంబాయి పోలిసులము అని చెప్పి తప్పుడు కాల్స్ చేయడం ద్వారా, కస్టమర్కేర్ ద్వారా వచ్చే కాల్స్తో ఏ విధంగా ప్రజలు సైబర్ నేరాల భారిన పడతారు అనే విషయాలపై పూర్తిగా అవగాహన కల్పించారు.




# హైకోర్టును ఆశ్రయించిన జగన్

**అమరావతి, ప్రజానావ:** తనకు వ్యక్తిగత భద్రత తగ్గించారంటూ వైసీపీ అధినేత జగన్ ఏపీ హైకోర్టును ఆశ్రయించారు. తనకు ముఖ్యమంత్రిగా ఉన్నప్పటి సెక్యూరిటీని కొనసాగించేలా ఆదేశాలు ఇవ్వాలంటూ జగన్ పిటిషన్ దాఖలు చేశారు. కూటమి ప్రభుత్వం ఏకపక్షంగా తన భద్రతను తొలగించిందని, తనను అంతమొందించే లక్ష్యంతోనే ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నారని జగన్ తన పిటిషన్ లో ఆరోపించారు. తనకు ప్రాణహాని ఉన్న విషయాన్ని పరిశీలించకుండానే ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకోవడం తగదని పేర్కొన్నారు. అయితే, జగన్ కు భద్రత తగ్గించారన్న వాదనలను పోలీసు శాఖ, రాష్ట్ర ప్రభుత్వం కొట్టిపారేశాయి. నిబంధన మేరకే జగన్ కు భద్రత కేటాయించామని ప్రభుత్వ వర్గాలు స్పష్టం చేశాయి. జగన్కు జడ్ ప్లస్ సెక్యూరిటీ కొనసాగుతుందని తెలిపాయి. ముఖ్యమంత్రి హోదాలో ఉన్నప్పుడు అదనంగా కల్పించే భద్రతనే ఇప్పుడు తగ్గించామని పోలీసు శాఖ వెల్లడించింది. జగన్ కు ఇప్పుడు సీఎం హోదా భద్రత ఇవ్వడం కుదరదని అధికారులు తేల్చిచెప్పారు. కాగా, జూన్ 3వ తేదీ నాటికి తనకు 900 మంది పోలీసులతో భద్రత ఉండేదని, ఇప్పుడు కూడా అదే భద్రత కావాలని జగన్ తరఫు న్యాయవాదులు పేర్కొన్నారు. జగన్ కు కేటాయించిన బుల్లెట్ ప్రూఫ్ వాహనం కూడా సరిగా లేదని తెలిపారు.

# గుర్తుతెలియని శవం లభ్యం

**వెల్దండ, ప్రజానావ:** గుర్తు తెలియని శవం వెల్దండ మండలం మహాత్మా గాంధీ కాలనీ తాండ గ్రామపంచాయతీ శివారులో లభ్యమైంది. చనిపోయిన వ్యక్తి వయస్సు సుమారు అరవై నుంచి అరవై ఐదు సంవత్సరాల వయసు ఉంటుందని , మృతదేహము కుళ్లిపోయిన స్థితిలో ఉన్నట్టుగా పోలీసులు గుర్తించారు. ఇట్టి మృతదేహానికి సంబంధించిన సమాచారం తెలిసిన వారు 8712657756, 8712657755 ఈ ఫోన్ నెంబర్ల ద్వారా తెలుపగలరని వెల్దండ ఎస్సై కురుమూర్తి తెలిపారు.

# శ్రీవారి భక్తులకు గుడ్ న్యూస్



**తిరుపతి, ప్రజానావ:** తిరుమల శ్రీవారిని దర్శించుకోవాలని ప్రతీ ఒక్కరూ కోరుకుంటారు. దేశంలోని అన్ని ప్రాంతాల నుంచి తిరుమలకు వస్తుంటారు. మరీ ముఖ్యంగా రెండు తెలుగు రాష్ట్రాల ప్రజలు ఏడాదిలో ఒక్కసారైనా శ్రీవారిని దర్శించుకోవాలని కోరుకునే వారు చాలా మంది ఉంటారు. అయితే దర్శనం టికెట్స్ ముందుగా లభించకనో, రూమ్స్ అందుబాటులో లేకో ఇబ్బంది పడుతుంటారు. ఇలాంటి వారికోసమే ఐఆర్సీటీసీ మంచి టూర్ ప్యాకేజీలను అందిస్తోంది. ముఖ్యంగా త్వరగా టూర్ను కంప్లీట్ చేయాలనుకునే వారికోసం ఐఆర్సీటీసీ ఆధ్వర్యంలో ఎయిర్ టూర్ ప్యాకేజీలు అందుబాటులో ఉన్నాయి. హైదరాబాద్ నుంచి ఈ ప్యాకేజీలు అందుబాటులో ఉన్నాయని మనకు తెలిసిందే. అయితే తాజాగా విశాఖపట్నం నుంచి కూడా ఐఆర్సీటీసీ ఈ టూర్ ప్యాకేజీని అందుబాటులోకి తీసుకొచ్చింది. ప్రస్తుతం ఆగస్టు 9, 23వ తేదీల్లో ఈ టూర్ అందుబాటులో ఉంది. ఇంతకీ ఈ ప్యాకేజీలో ఏయే ప్రాంతాలు కవర్ అవుతాయి.? ప్యాకేజీ ధర ఎంత.? లాంటి పూర్తి వివరాలు ఇప్పుడు తెలుసుకుందాం..

### టూర్ ఇలా సాగుతుంది..

మొదటి రోజు విశాఖపట్నం ఎయిర్ పోర్ట్ నుంచి ఉదయం 10.20 గంటలకు విమానం బయలుదేరుతుంది. మధ్యాహ్నం 12.10 గంటలకు తిరుపతి విమానాశ్రయానికి చేరుకుంటారు. అనంతరం అక్కడి నుంచి హోటల్లో తీసుకెళ్తారు. ఫ్రెషప్ అయిన తర్వాత భోజనం ముగించుకొని కాణిపాకం, శ్రీనివాస మంగాపురం ఆలయాల సందర్శన ఉంటుంది. తిరిగి హోటల్కు చేరుకున్న తర్వాత భోజనం చేసి రాత్రి హోటల్లోనే బస ఉంటుంది. రెండో రోజు ఉదయం టిఫిన్ చేయగానే తిరుమల వెంకటేశ్వర స్వామి శీఘ్రదర్శనం ఉంటుంది. దర్శనం పూర్తి కాగానే లంచ్ చేసిన తర్వాత శ్రీకాళహస్తి, తిరుచానూరు ఆలయాల దర్శనం ఉంటుంది. తిరిగి మళ్లీ సాయంత్రం హోటల్కు చేరుకుంటారు. రాత్రి తిరుపతి హోటల్లోనే బస ఉంటుంది. ఇక మూడో రోజు ఉదయం టిఫిన్ చేసిన తర్వాత హోటల్ నుంచి చెకవుట్ చేస్తారు. అనంతరం గోవింద రాజస్వామి దేవాలయం, ఇస్కాన్ ఆలయాలను సందర్శన ఉంటుంది. మధ్యలోనే భోజనం చేసిన తర్వాత మధ్యాహ్నం 3 గంటలకు తిరుపతి ఎయిర్ పోర్ట్కు చేరుకుంటారు. సాయంత్రం 5 గంటలకు విశాఖకు తిరుపతి నుంచి విమానం బయలు దేరుతుంది. సాయంత్రం 6:35 గంటలకు విశాఖపట్నం ఎయిర్ పోర్టుకు చేరుకోవడంతో టూర్ ముగుస్తుంది.

### ప్యాకేజీ ధర వివరాలు..


ప్యాకేజీ ధర విషయానికొస్తే.. సింగిల్ ఆక్యూపెన్సీ ప్రారంభ ధర రూ. 23,565, డబుల్ ఆక్యూపెన్సీ రూ. 20,195, ట్రిపుల్ ఆక్యూపెన్సీ రూ. 20,000, చైల్డ్ విత్ బెడ్ రూ. 18,375, చైల్డ్ వితవుట్ బెడ్ ధర రూ. 17,880గా నిర్ణయించారు.



# పుష్ప నుండి అదిరిపోయే అప్‌డేట్..

టాలీవుడ్ మోస్ట్ వెయిటెడ్ సినిమాలలో పుష్ప -2 ఒకటి. అల్లు అర్జున్ హీరోగా క్రియేటివ్ జీనియస్ సుకుమార్ దర్శకత్వంలో వచ్చిన పుష్ప ఊహించిన దాని కంటే విజయం సాధించడం, నేషనల్ వైడ్‌గా సూపర్ హిట్ అయింది. ముఖ్యంగా ఈ చిత్రంలోని పుష్ప అంటే ఫ్లవర్ అనుకుంటివా.. ఫైర్..తగ్గేదేలే అనే డైలగ్ వరల్డ్ వైడ్ గా ఫేమస్ అయిపోయింది. ఇప్పుడు 'పుష్ప'కు కంటిన్యూగా రాబోతోన్న 'పుష్ప 2: ది రూల్' ను అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు హీరో, దర్శకుడు. ముందుగా అనుకున్న కథ లో చాలా మార్పులు చేర్పులు చేసి పుష్ప -2ను తెరకెక్కిస్తున్నాడు. డిసెంబర్ 6న వరల్డ్ వైడ్ గా రిలీజ్ చేస్తామని ప్రకటించారు మేకర్స్. పుష్ప -2 ఫస్ట్ విడుదల చేయగా రికార్డు స్థాయి వ్యూస్ తో టాలీవుడ్ ని షేక్ చేసింది. ఈ చిత్రం నుంచి ఏ అప్‌డేట్ వచ్చినా ఎలాంటి ప్రమోషన్ కంటెంట్ విడుదలైన రికార్డు వ్యూస్‌తో దూసుకెళ్లింది. కాగా ఇటీవల పుష్ప సినిమాపై అనేక రూమర్స్ వినిపించాయి. హీరో , దర్శకుడికి మధ్య విభేదాలు వచ్చాయని షూటింగ్ ఆపేశారని, డిసెంబరులో ఈ సినిమా రాదు అంటూ రక రకాల పుకార్లు షికార్లు చేసాయి. అవేవి నిజం కాదని, ప్రస్తుతం పతాక సన్నివేశాలు అత్యంత అద్భుతంగా చిత్రీకరించే పనిలో ఉన్నారని. హీరోతో పాటు సినిమాలోని కీలక నటులు షూటింగ్ లో పాల్గొంటున్నారు. సినిమాకు ఈ సన్నివేశాలు ఎంతో హైలైట్‌గా వుండబోతున్నాయి. అంతేకాదు రేపు థియేటర్‌లో ఈ పతాక సన్నివేశాలు గూజ్ బంప్స్ వచ్చే విధంగా ఉండబోతున్నాయి. అల్లు అర్జున్ అభిమానులు మరో బ్లాక్‌బస్టర్ కోసం వెయిట్ చేయడమే తరువాయి అంటున్నారు చిత్ర యూనిట్ సభ్యులు.

# డైలమాలో డబుల్ ఇస్మార్ట్ రిలీజ్



పూరి జగన్నాథ్ తాజా చిత్రం డబుల్ ఇస్మార్ట్. రామ్, కావ్య థాపర్ హీరో, హీరోయిన్లుగా నటించిన ఈ చిత్ర ట్రైలర్ లాంచ్ కార్యక్రమం విశాఖలో ఘనంగా జరిగింది. విడుదలకు కేవలం కొన్ని రోజులు మాత్రమే సమయం ఉన్న ఈ చిత్రం నైజాం పంచాయితీ ఇంకా ఎటూ తేలలేదు. కారణం పూరి గత చిత్రం లైగర్. విజయ్ దేవర కొండా హీరోగా పూరి దర్శకత్వంలో వచ్చిన ఈ చిత్రం ఇండస్ట్రీ డిజాస్టర్ లలో ఒకటిగా నిలిచింది. ఈ సినిమాను భారీ ధర వెచ్చించి నైజాం రైట్స్ కొనుగోలు చేసాడు వరంగల్ శ్రీను. లైగర్ ఫ్లాప్ తో డిస్ట్రిబ్యూటర్లు, ఎగ్జిబిటర్లు భారీగా నష్టపోయారు. తమకు నష్ట పరిహారం చెల్లించకుండా నైజాంలో డబుల్ ఇస్మార్ట్ విడుదలను నిలిపివేయాలని డిస్ట్రిబ్యూటర్లు మరియు ఎగ్జిబిటర్లు ఫిల్మ్ ఛాంబర్‌ను ఆశ్రయించారు. కొందరు ఈ విడుదలను బహిష్కరించాలని కూడా నిర్ణయించుకున్నారు.దీంతో డబుల్ ఇస్మార్ట్ రిలీజ్ డైలమాలో పడింది. ఇటీవల ఈ వివాదాన్ని పరిష్కరించడం కోసం భేటీల మీద భేటీలు జరిగాయి కానీ ఎటు తేలలేదు. ఫైనల్ గా ఈ వ్యవ్యరంలోకి నైజాం టాప్ డిస్ట్రిబ్యూటర్, ఫైనాన్షియర్ మరియు నిర్మాత ఏషియన్ సునీల్ రంగంలోకి దిగారు. లైగర్ ను కొని నష్టపోయిన డిస్ట్రిబ్యూటర్ వరంగల్ శ్రీనుకు అలాగే ఎగ్జిబిటర్లకు ఏషియన్ సునీల్ కొంత మొత్తం నష్టపరిహారం చెల్లించి, ఏషియన్ సునీల్ నిర్మాణంలో పూరి జగన్నాథ్ ఓ సినిమా చేసేలా ఒప్పందం చేసినట్టు తెలుస్తోంది. ఇందుకు ఇరు పక్షాలు అంగీకరించారని సమాచారం అందుతోంది. మరోవైపు డబుల్ ఇస్మార్ట్ ఇండియా థియేట్రికల్ రైట్స్ ప్రైమ్ షో ఎంటర్టైన్మెంట్స్ నిర్మాత నిరంజన్ రెడ్డి రూ. 60 కోట్లకు కొనుగోలు చేసారు. ఆగస్టు 15న వరల్డ్ వైడ్ గా రిలీజ్ కానుంది డబుల్ ఇస్మార్ట్.



# ప్రభాస్‌తో పెళ్లి నిజమైతే బాగుండు..

## పాయల్ రాజ్‌పుత్

గత కొన్నేళ్లుగా పాన్ ఇండియా స్టార్ 'ప్రభాస్' పెళ్లి పెద్ద చర్చనీయాంశంగా మారిన విషయం తెలిసిందే. పలువురు హీరోయి న్స్‌తో పెళ్లంటూ సోషల్ మీడియాలో న్యూస్ చక్కర్లు కొట్టాయి. ఈ జాబితాలో అనుష్క శెట్టి, కృతి సనన్ సహా పాయల్ రాజ్‌పుత్ కూడా ఉన్నారు. ప్రభాస్‌తో పాయల్ పెళ్లైందంటూ అప్పట్లో వార్తలు వచ్చాయి. ఈ రూమర్‌పై తాజాగా పాయల్ పాప స్పందించారు. ప్రభాస్‌తో పెళ్లైందంటూ వచ్చిన వార్త నిజమైతే బాగుండు అని సరదాగా అన్నారు. తాజాగా హైదరాబాద్‌లో ఫిలింఫేర్ అవార్డ్స్ సౌత్ 2024 వేడుకలు జరగగా.. అవార్డుల ప్రదానోత్సవంలో పాయల్ రాజ్‌పుత్ సందడి చేశారు. ఈ సందర్భంగా ఆమె పలు ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. ఇప్పటివరకూ మీ గురించి వచ్చిన ఫన్నీ రూమర్ ఏంటి?అనే ప్రశ్నకు పాయల్ బదులిచ్చారు. 'ప్రభాస్‌తో నా పెళ్లైందంటూ అప్పట్లో వార్తలు వచ్చాయి. వాటిని చూసి నేను బాగా నవ్వుకున్నా. ఆ వార్తలు నిజమైతే బాగుండు అని కూడా అనుకున్నా' అని సరదాగా అన్నారు. ప్రభాస్ అంటే తనకు ఎంతో ఇష్టమని పాయల్ పలు సందర్భాల్లో చెప్పారు. అవకాశం వస్తే ఆయనతో యాక్ట్ చేస్తానని కూడా చెప్పారు.'ఆర్ఎక్స్ 100' చిత్రంతో పాయల్ రాజ్‌పుత్ ఇండస్ట్రీలోకి అడుగుపెట్టారు. తొలి చిత్రంతోనే తెలుగు యువత హృదయాలు దోచుకున్నారు. వెంకీమామ, ఆర్‌డీఎక్స్ లవ్, డిస్కో రాజా, జిన్నా, తీస్ మార్ ఖాన్, మాయాపేటిక, మంగళవారం వంటి చిత్రాల్లో నటించి మెప్పించారు. ఇటీవల రక్షణ చిత్రంతో ప్రేక్షకుల ముందుకు వచ్చారు. ఈ సినిమాలో పాయల్ నటనకు మంచి మార్కులే పడ్డాయి. ప్రస్తుతం గోల్‌మాల్, ఏంజెల్, కిరాతక సినిమాల్లో నటిస్తున్నారు.



# 'కల్కి'లో కమల్‌హాసన్ పాత్రను వదులుకున్న హీరో?

పాన్ ఇండియా రెబల్ స్టార్ ప్రభాస్ కథానాయకుడిగా వచ్చిన తాజా చిత్రం కల్కి. బాక్సాఫీస్ దగ్గర సంచలన విజయాన్ని నమోదు చేయడమే కాదు.. ఇటీవలకాలంలో రూ.వెయ్యి కోట్లు రాబట్టిన చిత్రంగా నిలిచింది. అమితాబ్ బచ్చన్, కమల్ హాసన్, దీపికా పదుకొనే లాంటి భారీ తారాగణం ఈ చిత్రంలో నటించింది. వైజయంతీ మూవీస్ పతాకంపై అశ్వనీదత్ రూ.600 కోట్ల బడ్జెట్ తో నిర్మించారు. ఈ సినిమాలో అమితాబ్ బచ్చన్, కమల్ హాసన్ పాత్రలు అందరినీ ఆకట్టుకున్నాయి. కమల్ పాత్ర నిడివి తక్కువే అయినప్పటికీ రెండో భాగంలో చాలా కీలకం కాబోతోంది. సైన్స్ ఫిక్షన్ కు పురాణాలను ముడిపెట్టిన దర్శకుడి ఆలోచన అందరికీ నచ్చింది. దీంతో రెండో భాగం ఎప్పుడు వస్తుందా? అని అందరూ ఎదురుచూస్తున్నారు. కమల్ హాసన్ తన విలనిజాన్ని ఎలా పండించాడు అనేది తెలుసుకోవాలంటే రెండో భాగం విడుదలయ్యేంతవరకు ఎదురుచూడాల్సిందే. ఈ సినిమాలో విలన్ పాత్ర కోసం దర్శకుడు నాగ్ అశ్విన్ ముందుగా కమల్ ను సంప్రదించగా తర్వాత చెబుతాను అన్నారుకానీ నటిస్తాను అని కచ్చితంగా చెప్పలేదు. దీంతో దర్శకుడు కమల్ నటించనంటే ఎవరిని తీసుకోవాలా అనే ఆలోచనలో పడ్డారు. చివరకు ఆయన మళయాళ సూపర్ స్టార్ మోహన్ లాల్ వైపు మొగ్గుచూపారు. కమల్ చేయనంటే ఆ పాత్రకు ఆయన బాగా న్యాయం చేస్తాడని భావించారు. అయితే ఈలోగానే కమల్ కబురు పంపారు. తాను ఈ సినిమాలో నటిస్తున్నట్లు చెప్పారు. ఈ సినిమాలో నటించినందుకు ఆయనకు భారీగా పారితోషికం ఇచ్చారు. ఒకరకంగా మోహన్ లాల్ చేసినా ఈ సినిమాకు బాగా కలిసివచ్చేదని, కమల్ నటిస్తానని చెప్పడంతో మోహన్ లాల్ కు మిస్సయిందంటున్నారు. రెండో భాగంలో పురాణ కథలతో కమల్ పాత్రను ముడిపెట్టాల్సి ఉంటుంది. ఈ రెండు అంశాలకు లింకు ఏమిటా అని ప్రేక్షకులు ఆలోచనలో పడ్డారు. మొదటిభాగం కన్నారెండో భాగం బాగా ఆడుతుందనే అంచనాలు కూడా ఉన్నాయి.




# దక్కన్ సొసైటీ లాంటి సంస్థలను ప్రోత్సహించాలి

- సేంద్రియ పద్దతుల్లో తృణధాన్య పంటలు పండించాలి
- పలువురు రైతుల సూచన

**సంగారెడ్డి, ప్రజానావ:** రేషన్ షాపుల్లో తృణ ధాన్యాలు అందుబాటులోకి తీసుకుని రావాలని రైతులు కోరుతున్నారు. ఆరోగ్యానికి తృణ ధాన్యాలు మంచివి. ఇలాంటి పంటలను ప్రోత్సహించి ప్రజలకు అందుబాటులోకి తేవాల్సి ఉంది. ప్రధానంగా హాస్టళ్లలో విద్యార్తులకు తృణధాన్యాలతో చేసిన పదార్థాలను అందిస్తే బాలలు ధృడంగా అవుతారని వైద్యులు అంటున్నారు. సేంద్రియ పద్దతిలో తృణధాన్యాలను ఉత్పత్తి చేయడంలో ఉమ్మడి మెదక్ జిల్లాలో దక్కన్ డెవలప్‌మెంట్ సొసైటీ చేస్తున్న కృషి సర్వత్రా ప్రశంసలు అందుకుంటోంది. దీనిని ఇతర ప్రాంతాలకు కూడా విస్తరించడం ద్వారా వ్యవసాయంలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టవచ్చు. ఈ సొసైటీ ఇచ్చిన సూచనలు పాటించి వ్యవసాయం చేస్తున్న కారణంగా రైతులు లాభాల బాటపడుతున్నారు. అయితే వీరు పండించే పంటలు ప్రజలకు ఎంతో అవసరం. ఈ దశలో ఇక పోతే గిరిజనులు ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో చౌక ధరల దుకాణాల ద్వారా జొన్నలు పంపిణీ చేసేందుకు కసరత్తు చేయాలని కోరుతున్నారు. అలాగే, అంగన్‌వాడీ కేంద్రాల్లోని పిల్లలకు చిరు, తృణ ధాన్యాల ఆహారాన్ని అందించాలని కూడా సూచిస్తున్నారు. ఎంపిక చేసిన గ్రామాల్లో కుటుంబానికి 8 కిలోల చొప్పున జొన్నలను సబ్సిడీపై పంపిణీ చేయాలన్నారు. గతంలో జొన్నలు, మక్కలు, గోధుమలు చౌక దుకాణాల్లో దొరికేవి కానీ సబ్సిడీ బియ్యం పథకం వచ్చాక వీటిని పక్కన పెట్టారు. జిల్లా వ్యాప్తంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో తృణ ధాన్య ఆహారం అందించేందుకు ప్రతిపాదనలు రూపొందించాల్సి ఉంది. జిల్లాలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో వీటిని అందుబాటులోకి తీసుకుని రావాలి. గిరిజన జనాభా ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో రేషన్ షాపుల ద్వారా జొన్నలు పంపిణీ చేసే విషయాన్ని పరిశీలించాలి. పైలట్ ప్రాజెక్టులో భాగంగా అంగన్ వాడీ కేంద్రాల్లోనూ చిరు, తృణ ధాన్యాలను పంపిణీ చేస్తే బాగుంటందన్న అభిప్రాయం వస్తోది. అంగన్ వాడీ కేంద్రాలలోని పిల్లలకు చిరు, తృణ ధాన్యాల ఆహారాన్ని అందించడం ద్వారా ఆరోగ్యాన్ని అందించవచ్చు. రాష్ట్రమంతటా అమలు చేయాలని మహిళా శిశు సంక్షేమ శాఖను కోరుతున్నారు. అయితే చిరు, తృణ ధాన్యాలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సబ్సిడీని భరించే పరిస్థితి లేదు. పైగా వీటిని అన్ని జిల్లాల్లో తీసుకునే అవకాశం కూడా లేదు. గిరిజన జనాభా ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో దీన్ని అమలు చేస్తే మంచి ఫలితాలు రావచ్చు. రైతులను ప్రోత్సహిస్తే సంప్రదాయంగా తృణ ధాన్యాలను పండించడమే కాకుండా ఎక్కువగా వినియోగిస్తారు.

# తెలంగాణ కోసం పరితపించిన జయశంకర్

## స్వయం పాలనతోనే శాసించుకోగలం అన్న నమ్మిక

## నిరంతరం తెలంగాణ కోసం ఉద్యమించిన దీప్తి

## నేడు ప్రొఫెసర్ జయశంకర్ జయంతి



**వరంగల్, ప్రజానావ:** నిజాం కాలంనాటికే తెలంగాణ ప్రాంతంలో గొలుసు చెరువులు చాలా ఉండేవి. ఉద్దేశ పూర్వకంగానే వాటిని నాశనం చేశారు. తెలంగాణ వస్తే మొదటగా ఈ చెరువులను పునరుద్ధరించాలి. అన్నీ సాధ్యం కాకపోవచ్చు.. అయినా వీటిని బాగుచేస్తే.. గ్రామీణ ఆర్థిక వ్యవస్థ సస్యశ్యామలం అవుతుంది. దివంగత ప్రొఫెసర్ జయశంకర్ సార్ కన్న కలలు ఇవి. తెలంగాణ ఏర్పాటు వల్ల స్వయం సమృద్ధి సాధిస్తామని బలంగా నమ్మి, జీవితాంతం తెలంగాణ ఏర్పాటు కోసం అహరహరం శ్రమించారు. ఇప్పుడు జలవనరుల విషయంలో కృషి జరగాలని ఆనాటి జయశంకర్ సార్ కలలు గుర్తు చేస్తున్నాయి. ఇక నిజాం కాలంలో విద్య, వైద్యం రెండూ ఉచితమే.. అయితే వీటన్నింటిని వారు నాశనం చేశారు. అభివృద్ధి అంటారు కానీ వాళ్లు ఇక్కడ ఒక్క ఆసుపత్రినిగానీ, కాలేజీనిగానీ కట్టారా అని జయశంకర్ సార్ తరచూ ప్రశ్నించేవారు. తెలంగాణ వస్తే ముఖ్యంగా వనరుల కొరత ఉండదు. ఇప్పుడు వాటిని ఇష్టానుసారంగా, అక్రమంగా తరలించుకుపోతున్నారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత మన పైసలు మనం వాడుకుంటాం. అన్నిటికన్నా ముఖ్యమైనది ఏంటంటే? ఈ ప్రాంతంలో ప్రజాస్వామిక సంస్కృతిని ఉమ్మడి ప్రభుత్వాలు ధ్వంసం చేశాయి. ఉద్యమాలను అణచివేసే పేరుతో బీభత్సం సృష్టించారు. అడుగడుగున పోలీస్ రాజ్యమే ఉంది. అందుకే ప్రజాస్వామిక సంస్కృతి తిరిగి స్థాపించబడాలి. అది జరిగితేనే మిగతా కార్యక్రమాలు జరుగుతాయి. తెలంగాణలో ఇవన్నీ సాధ్యమే.. ఎందుకంటే తెలంగాణ ప్రజల్లో ఆ చైతన్యం ఉంది కనుక అని మనసారా నమ్మిన వ్యక్తి దివంగత తెలంగాణ సిద్దాంతకర్త కొత్తపల్లి జయశంకర్ సార్. తెలంగాణ సిద్దాంతకర్తగా పేరుపొందిన ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ ఆగష్టు 6, 1934వ సంవత్సరంలో జన్మించారు. జూన్ 21, 2011లో తెలంగాణ ఏర్పడకుండానే మరణించారు. హనుమకొండ జిల్లా, ఆత్మకూరు మండలం పెద్దాపూర్ గ్రామశివారు అక్కంపేటలో జన్మించారు. తెలుగు, ఉర్దూ, హిందీ, ఇంగ్లీషు భాషల్లో మంచి ప్రావీణ్యం ఉన్న జయశంకర్ తెలంగాణ ఉద్యమానికే తన జీవితాన్ని అంకితం చేసి ఆజన్మ బ్రహ్మచారిగా జీవించారు. ఆర్థికశాస్త్రంలో పీహెచ్‌డి పట్టా పొంది, ప్రిన్సిపాల్‌గా, రిజిస్ట్రార్‌గా పని చేసి కాకతీయ విశ్వవిద్యాలయం వైస్-ఛాన్సలర్ వరకు ఉన్నత పదవులు పొందారు. 1969 తెలంగాణ ఉద్యమంలోనూ, అంతకు ముందు నాన్ ముల్కీ ఉద్యమంలో, సాంబార్- ఇడ్లీ గోబ్యాక్ ఉద్యమంలో పాల్గొన్నారు. తెలంగాణ రాష్ట్ర సమితి పార్టీ ఏర్పాటులో కె.చంద్రశేఖరరావుకు సలహాదారుగా, మార్గదర్శిగా వెన్నంటి నిలిచారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ఆవశ్యకతపై పలు పుస్తకాలు రచించారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కళ్ళారా చూడాలని తరుచుగా చెప్పే జయశంకర్ 2011 జూన్ 21న ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటుకు ముందే మరణించారు. జయశంకర్ తల్లి మహాలక్ష్మి, తండ్రి లక్ష్మీకాంత్‌రావు. ఆయనకు ముగ్గురు అన్నదమ్ములు, ముగ్గురు అక్కచెల్లెళ్లు ఉన్నారు. జయశంకర్ తల్లిదండ్రులకు రెండో సంతానం. సొంత కుటుంబాన్ని నిర్మించుకోకుండా తెలంగాణ ఉద్యమానికే తన జీవితాన్ని అంకితం చేసి ఆజన్మ బ్రహ్మచారిగా మిగిలిపోవడమే గాకుండా..తెలంగాణ కోసం నిరంతరం తపించిన ఓ ఉద్యమదీప్తిగా నిలిచారు. బెనారస్, అలీగఢ్ విశ్వవిద్యాలయాలనుంచి ఆర్థికశాస్త్రంలో పట్టా అందుకున్న జయశంకర్ ఉస్మానియా విశ్వవిద్యాలయంలో పీహెచ్‌డీ చేశాడు. 1975 నుంచి 1979 వరకు వరంగల్‌లోని సీకేఎం కళాశాల ప్రిన్సిపాల్‌గా పనిచేశాడు. 1979 నుంచి 1981 వరకు కాకతీయ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్‌గా, 1982 నుంచి 1991 వరకు సీఫెల్ రిజిస్ట్రార్‌గా, 1991 నుంచి 1994 వరకు అదే యూనివర్శిటీకి ఉపకులపతిగా పనిచేశాడు. అధ్యాపకుడిగా ఆయన ఎంతో మందికి మార్గనిర్దేశం చేశారు. వృత్తిపట్ల నిబద్ధతను, తెలంగాణ ఉద్యమం పట్ల చిత్తశుద్ధిని వారిలో నూరిపోశారు. ఎమ్జన్సీ కాలంలో ఆయన సీకేఎం కళాశాలకు ప్రిన్సిపల్‌గా పనిచేశారు. సీకేఎం కళాశాల అంటేనే జిల్లాలో విప్లవ విద్యార్థి ఉద్యమానికి కేంద్రంగా అప్పట్లో పేరుండేది. విప్లవకవి వరవరరావు లాంటి వాళ్లు ఆ కాలేజీలో అధ్యాపకులుగా వ్యవహరించారు. ఎమ్జన్సీ గడ్డురోజుల్లో ఆయన కళాశాలను నడిపి ఎంతో మంది విద్యార్థుల్ని, అధ్యాపకుల్ని ఆయన నిర్బంధం నుంచి కాపాడారు. ఆయన అధ్యాపకుడిగా హన్మకొండలోని మల్టీపర్పస్ స్కూల్లో మొదట తెలుగు బోధించారు. ఒక అధ్యాపకున్ని విద్యార్థులు గుర్తుపెట్టుకోవడం సర్వసాధారణమే కానీ ఒక అధ్యాపకుడే తన విద్యార్థుల్ని గుర్తుపెట్టుకొని పేరుపెట్టి పిలవడం ఒక్క జయశంకర్ కే సాధ్యం అంటూ ఆయనకు తనకు 35 ఏళ్ల అనుబంధం ఉందని, ప్రముఖ సాహితివేత్త రామశాస్త్రి కన్నీళ్లపర్యంతమయ్యారు. జయశంకర్ విద్యార్థుల్లో అనేక మంది దేశవిదేశాల్లో ప్రస్తుతం ప్రముఖ స్థానంలో ఉన్నారు. వీరిలో కేయూ మాజీ ప్రొఫెసర్ ఎన్. లింగమూర్తి, ప్రొఫెసర్ కూరపాటి వెంకటనారాయణ, ప్రొఫెసర్ కే. సీతారామావు తదితరులు అనేక మందికి ఆదర్శ గురువు జయశంకర్. తెలంగాణా ఉద్యమంలో 1969 తెలంగాణా ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్నాడు. 1952 లో జయశంకర్ నాన్ ముల్కీ ఉద్యమంలో, సాంబార్, ఇడ్లీ గోబ్యాక్ ఉద్యమంలో పాల్గొన్నాడు. తెలంగాణ, ఆంధ్ర రాష్ట్రాల విలీనాన్ని వ్యతిరేకిస్తూ విద్యార్థి నాయకుడిగా ఆయన 1954 లో ఫజల్ అలీ కమిషన్‌కు నివేదిక ఇచ్చాడు. కె.సి.ఆర్‌కు సలహాదారుగా, మార్గదర్శిగా తోడ్పాటు అందించాడు. తెలంగాణా రాష్ట్ర ఏర్పాటు ఆవశ్యకతపై ఆయన పుస్తకాలు రాశాడు. తెలంగాణలోనే కాకుండా, దేశంలోని ఇతర ప్రాంతాల్లో, విదేశాల్లో తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ఆవశ్యకత గురించి ప్రసంగాలు చేశాడు. జయశంకర్ తన ఆస్తిని, జీవితాన్ని తెలంగాణ కోసం అంకితం చేశాడు. విదేశాల్లో తెలంగాణ ఉద్యమాన్ని నడిపిన తెలంగాణ ఉద్యమాన్ని గల్లీ నుంచి ఢిల్లీదాకా, ఢిల్లీ నుంచి అమెరికా దాకా వ్యాప్తిచేయడంలో ఆయన పాత్ర మరవలేనిది. ఎవరూ మాట్లాడటానికి సాహసించని కాలంలోనే 1954 విశాలాంధ్ర ప్రతిపాదనను ఎండగట్టిన ధీశాలి జయశంకర్. ఆయన ఏం చేసినా తెలంగాణ కోణంలోనే నిత్యం ఆలోచించి ఆచరించే మహనీయుడు.



# సరిహద్దులు దాటుతున్న సబ్సిడీ బియ్యం

- సన్నబియ్యంగా మార్చి అమ్మకం
- వ్యాపారులతో డీలర్ల కుమ్మక్కు?

**నిజామాబాద్, ప్రజానావ:** రేషన్ షాపుల్లో సరఫరా చేసే కిలో రూపాయి బియ్యాన్ని తక్కువ ధరకు కొని.. వాటికి పాలిష్ పట్టించి మార్కెట్లో సన్నబియ్యంగా విక్రయిస్తున్నారు. సరిహద్దు గ్రామాల గుండా కర్నాటక, మహారాష్ట్రల్లో ఈ వ్యవహారం సాగుతోంది. రాత్రి వేళల్లో బియ్యాన్ని గోదాం నుంచి ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నట్లు తెలుస్తోంది. గోదాంలో నిల్వ ఉంచిన బియ్యాన్ని ఇతర ప్రాంతాలకు తరలించే బియ్యంలో కలిపే ప్రయత్నాలు నిత్యం జరుగుతున్నాయన్న ఆరోపణలు ఉన్నాయి. దీనికి స్థానికంగా ఉన్న కొందరు డీలర్ల సహకారం ఉందన్న ఆరోపణలు ఉన్నాయి. డీలర్లకు కేటాయించే బియ్యాన్ని కొందరు పూర్తి స్థాయిలో తీసుకెళ్లకుండా నిల్వ ఉంచడం వల్ల ఎవరికీ ఎలాంటి ఇబ్బందులు లేకుండా గుట్టుగా ఇతర ప్రాంతాలకు బియ్యం తరులు తున్నాయని తెలుస్తోంది. స్థానికంగా ఉన్న కొందరి నేతల కనుసన్నల్లోనే ఇదంతా సాగుతోందన్న ఆరోపణలు ఉన్నాయి. లారీలు, ఇతర రవాణాల ద్వారా గుట్టు చప్పుడు కాకుం డా మన బియ్యాన్ని కర్నాటక, మహారాష్ట్రకు తరలిస్తున్నారు. అధికారులు సైతం చూసీచూడ నట్లు వ్యవహరించడంతో పట్టపగలే బియ్యాన్ని ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. వ్యాపారుల తో కుమ్మకై బియ్యాన్ని అమ్ముకుంటున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. విజిలెన్సు అధికారులు ఎన్ని సార్లు పట్టుకున్నా దందా మాత్రం ఆగడం లేదు. ఓ వైపు విజిలెన్స్ అధికారులు బియ్యం పట్టుకొని కేసులు నమోదు చేసుండగానే మరో చోట బియ్యం ఇతర ప్రాంతాలకు తరలుతోంది. పౌరసరఫరాల గోదాం అధికారులు పరోక్షంగా సాయం చేస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నా యి. కిలో ఒక్క రూపాయికి లభించే బియ్యాన్ని చిన్నపాటి వ్యాపారులు రూ.10లకు పైగా వెచ్చించి ఆటోల్లో ఇక్కడి తరలిస్తున్నారు. చెక్‌పోస్టులు బియ్యం వ్యాపారులకు వరంగా మారాయి.

# డెత్ సెంటర్లుగా ఢిల్లీ కోచింగ్ సెంటర్లు

## ముగ్గురు విద్యార్థుల దుర్మరణం ఘటనపై విచారణ

## కేంద్రం, ఢిల్లీ ప్రభుత్వాలకు సుప్రీం నోటీసులు




**న్యూఢిల్లీ:** దేశ రాజధాని ఢిల్లీలో ఓ కోచింగ్ సెంటర్ బేస్‌మెంట్‌లోకి వరద పోటెత్తి ముగ్గురు విద్యార్థులు మృతి చెందిన ఘటన సంచలనంగా మా రింది. ఈ వ్యవహారాన్ని సుమోటోగా స్వీకరించిన సుప్రీంకోర్టు తీవ్ర వ్యాఖ్యలు చేసింది. దీనిపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేసిన న్యాయస్థానం.. అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేసింది. కేంద్రం, ఢిల్లీ ప్రభు త్వాలకు నోటీసులు జారీ చేసింది. కోచింగ్ సెంటర్లను నియంత్రించడంలో అధికారులు విఫలమ య్యారని మండిపడింది. ఐఏఎస్ కావాలనే లక్ష్యంతో ఢిల్లీకి వచ్చి న విద్యార్థుల జీవితాలతో ఆడుకుంటున్నారు. నగరం లోని కోచింగ్ సెంటర్లు డెత్ ఛాంబర్‌లుగా మారాయి. వాటిని సక్రమంగా నిర్వహించడంలో అధికా రులు నిర్ల క్ష్యం వహించారు. ఈ ఘటన అందరి కళ్లు తెరిపిం చింది' అంటూ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ ఉజ్జల్ భుయాన్‌లతో కూడిన ధర్మాసనం ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇనిస్టిట్యూట్‌లో భద్రతా ప్రమాణాలు అందించే వరకూ ఆన్‌లైన్‌లో తరగతులు నిర్వహించుకోవచ్చని సూచించింది. కోచింగ్ సెంటర్లను ఎలాంటి నిబంధనల ప్రకారం నిర్వహిస్తున్నారో న్యాయస్థానానికి వివరించాలంటూ కేంద్రం, ఢిల్లీ ప్రభుత్వాలకు నోటీసులు జారీ చేసింది. కాగా.. సెంట్రల్ ఢిల్లీలోని ఓల్డ్ రాజేంద్రనగర్‌లోని ఐఏఎస్ స్టడీ సెంటర్‌లోకి వరదనీరు పోటెత్తి ముగ్గురు విద్యార్థులు మృతి చెందిన ఘటన దేశవ్యాప్తంగా సంచలనంగా మారిన సంగతి తెలిసిందే. దీనిపై విద్యార్థుల ఆందోళనలు కొనసాగుతూనే ఉన్నాయి. నగరంలో విద్యార్థులు నిత్యం ఎదుర్కొంటున్న సమస్యలు వెలుగులోకి వస్తున్నాయి. ఇటీవల అధికారుల తీరును ఢిల్లీ హైకోర్టు తీవ్రంగా తప్పుబట్టింది. ఉచితాలను ప్రోత్సహిస్తూ.. పన్నులు వసూలు చేయకుండా బహుళ అంతస్తుల నిర్మాణాలకు అనుమతించి డ్రైనేజీ వ్యవస్థను నిర్లక్ష్యం చేస్తే ఇలాంటి అనర్థాలకు దారితీస్తుందని పేర్కొంది. ఈ కేసును సీబీఐకి బదిలీ చేసింది. ఈ క్రమంలోనే సుప్రీంకోర్టు సుమోటోగా స్వీకరించింది.



# జమ్మూకాశ్మీర్‌లో ఎన్నికలు నిర్వహించండి

## కేంద్రానికి ఖర్గే డిమాండ్

**న్యూఢిల్లీ:** జమ్మూకశ్మీర్‌లో ఎన్నికలు నిర్వహించాలని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే డిమాండ్ చేశారు. ఎన్నికల నిర్వహణలో నిర్లక్ష్యంపై కేంద్ర ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. సుప్రీంకోర్టు నిర్దేశిరచిన గడువు ప్రకారం జమ్మూకశ్మీర్‌లో ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. తద్వారా అక్కడి ప్రజలు తమ నాయకులను ఎన్నుకుంటారని తెలిపారు. జమ్మూకశ్మీర్‌లో ఆర్టికల్ 370 రద్దు చేసి, ఐదేళ్లు పూర్తయిన సందర్భంగా ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఆర్టికల్ 370 రద్దుతో ఆ ప్రాంత ఆర్థికాభివృద్ధి మెరుగు పడుతుందని, తీవ్రవాదాన్ని అరికట్టే అవకాశం ఉంటుం దని గతంలో మోదీ చెప్పారు. అయితే.. ప్రస్తుతం ఆయన మాటలకు భిన్నంగా జమ్ములో ఉగ్రదాడులు రోజురోజు కూ పెరిగిపోతున్నాయి. 2019 నుంచి ఇప్పటి వరకు 683 ఉగ్రదాడులు చోటుచేసుకున్నాయి. 258 మంది జవాన్లు, 170 మంది పౌరులు ప్రాణాలు కోల్పో యారని ఖర్గే పేర్కొన్నారు. ఇటీవల ప్రధాని నరేంద్ర మో దీ మూడోసారి ప్రమాణ స్వీకారం చేసినప్పటి నుంచి జమ్ములో 25 ఉగ్రదాడులు జరిగాయని.. 15 మంది సైనికులు ప్రాణాలు కోల్పోగా, 27 మంది గాయపడ్డారని తెలిపారు.

# టేబుల్ టెన్నిస్ క్వార్టర్ ఫైనల్లో భారత్

## చరిత్ర సృష్టించిన మహిళా టీమ్



**పారిస్:** ఒలింపిక్స్ టేబుల్ టెన్నిస్ పోటీల్లో భారత మహిళా జట్టు నయా చరిత్ర సృష్టించింది. సోమవారం జరిగిన మహిళల టీమ్ విభాగం ప్రిక్వార్టర్ ఫైనల్లో భారత్ 3-2 తేడాతో రొమేనియాపై సంచలన విజయం సాధించింది. ఈ గెలుపుతో భారత్‌కు క్వార్టర్ ఫైనల్ బెర్త్ దక్కింది. ఒలింపిక్స్‌లో భారత మహిళల టీటీ జట్టు క్వార్టర్ ఫైనల్‌కు చేరడం ఇదే తొలిసారి కావడం విశేషం. మనికా బాత్రా, ఆకుల శ్రీజ, అర్చనా కామత్‌లతో కూడిన భారత త్రయం చారిత్రక విజయంతో క్వార్టర్ ఫైనల్‌కు దూసుకెళ్లింది. తొలుత డబుల్స్‌లో శ్రీజ, అర్చనా కామత్ జోడీ అద్భుత ఆటతో జయకేతనం ఎగుర వేసింది. దయాకోసమర ఎలిజబెటా జోడీతో జరిగిన పోరులో శ్రీజ జంట 11-9, 12-10, 11-7 తేడాతో జయ-ంభేరి మోగించింది. తర్వాత జరిగిన మొదటి సింగిల్స్‌లో స్టార్ క్రీడాకారిణి మనికా బాత్రా దూకుడైన ఆటతో చెలరేగి పోయింది. ఏకపక్షంగా సాగిన మ్యాచ్‌లో మనిక బాత్రా 11-5, 11-7, 11-7 తేడాతో రొమేనియా క్రీడాకారిణి బెర్నాడెట్టేను ఓడించింది. అయితే తర్వాత జరిగిన రెండు మ్యాచుల్లో రొమేనియా పైచేయి సాధించింది. రెండో సింగిల్స్‌లో శరీజ పోరాడి ఓడింది. ఎలిజబెటాతో జరిగిన పోరులో శ్రీజ 11-8, 4-11, 11-7, 6-11, 8-11 తేడాతో ఓటమి పాలైంది. మూడో సింగిల్స్‌లో అర్చనా కామత్ కూడా పరాజయం చవిచూసింది. బెర్నాడెట్టేతో జరిగిన పోరులో అర్చనా ఓటమి పాలైంది. అయితే ఫలితాన్ని తేల్చే ఐదో గేమ్‌లో మనికా బాత్రా అసాధారణ ఆటతో అలరించింది. దయాకోనుతో జరిగిన కీలక పోరులో మనికా బాత్ర అద్భుత విజయం సాధించింది. ఈ గెలుపుతో భారత్ క్వార్టర్ ఫైనల్‌కు దూసుకెళ్లింది.



# ఒకే ఒక్క పాయింట్‌తో..!

- షూటింగ్‌లో చేజారిన కాంస్యం
- పోరాడి ఓడిన మహేశ్వరి చౌహాన్, అనంత్‌జిత్ సింగ్ ద్వయం

**పారిస్:** ఒలింపిక్స్ షూటింగ్‌లో నాలుగో పతకాన్ని సాధించే అవకాశాన్ని భారత్ త్రుటిలో చేజార్చుకుంది. సోమవారం జరిగిన స్కీట్ మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్ కాంస్య పతక పోరులో భారత్ ఒక్క పాయింట్ తేడాతో ఓటమి పాలై పతకం సాధించే అవకాశాన్ని కోల్పోయింది. భారత షూటర్లు మహేశ్వరి చౌహాన్, అనంత్‌జిత్ సింగ్ ద్వయం హెూరాహెూరీ పోరులో పరాజయం చవిచూసింది. చైనాకు చెందిన జియాంగ్, జియాన్లిన్‌తో జరిగిన మ్యాచ్‌లో భారత జంట 43-44 తేడాతో పోరాడి ఓడించింది. ఇరు జట్లు సర్వం ఒడ్డి పోరాడాయి. దీంతో మ్యాచ్ చివరి వరకు నువ్వా నేనా అన్నట్టు సాగింది. అయితే ఫలితం మాత్రం చైనా జోడీకి అనుకూలంగా వచ్చింది. దీంతో భారత జోడీ పతకం గెలిచే అవకాశాన్ని చేజార్చుకోక తప్పలేదు.

# ఒకేసారి ఐపీఎల్, పీఎస్ఎల్

**న్యూఢిల్లీ :** భారత్‌లో ఇండియన్ ప్రీమియర్ లీగ్ అత్యంత విజయవంతంగా నిలవడం వల్ల చాలా దేశాలు ఈ టీ20 లీగ్‌ను అనుసరించాయి. అలా మొదలైన వాటిల్లో పాకిస్థాన్ సూపర్ లీగ్ కూడా ఒకటి. అయితే వచ్చే ఏడాది పీఎస్ఎల్, ఐపీఎల్ మధ్య క్లాష్ జరిగే అవకాశముందని అంటున్నారు. పాకిస్థాన్ ఇంటర్నేషనల్ క్యాలెండర్ కారణంగా వచ్చే ఏడాది ఐపీఎల్ తేదీలు, పీఎస్ఎల్ తేదీలు క్లాస్ అయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. పాకిస్థాన్ సూపర్ లీగ్ సాధారణంగా ఫిబ్రవరి, మార్చి నెలలో జరుగుతుంది. ఐపీఎల్ మార్చి చివరిలో ప్రారంభమవుతుంది. ఈ సంవత్స రం కూడా పీఎస్ఎల్ ఫిబ్రవరి 17 నుంచి మార్చి 18 వరకు నిర్వహించారు. 2024 ఐపీఎల్ సీజన్ మార్చి 22 నుంచి మే 26 వరకు జరిగింది. అయితే, పాకిస్థాన్ క్రికెట్ బోర్డు, పీఎస్ఎల్‌ను వచ్చే ఏడాది ఏప్రిల్ 10 నుంచి మే 25 మధ్య నిర్వహించవచ్చని సంకేతాలు ఇస్తోంది. పాకిస్థా న్ ఇంటర్నేషనల్ మ్యాచ్‌లకు ఇబ్బంది కలగకుండా పాకి స్థాన్ సూపర్ లీగ్‌ను రీషెడ్యూల్ చేయాలని ఈ నిర్ణయం తీసుకుందట. ఒకవేళ ఇదే జరిగి ఐపీఎల్‌తో క్లాష్ అయితే రెండు లీగ్స్‌లో ఆడే ఇంటర్నేషనల్ ప్లేయర్స్, బ్రాడ్‌కాస్ట్ వ్యూవర్‌షిప్, స్పాన్సర్స్‌పై ప్రభావం పడుతుంది. ఇకపోతే పాకిస్థాన్ క్రికెట్ బోర్డు, పాకిస్థాన్ సూపర్ లీగ్‌కు సంబంధించి తాత్కాలిక షెడ్యూల్‌ను ప్రకటించడంతో పాటు దేశీయ ఆటగాళ్లకు నెలవారీ వేతనాలలో మార్పులు కూడా చేసింది.

**పాకిస్థాన్ సూపర్ లీగ్ 2025 షెడ్యూల్..**

**బంగ్లాదేశ్‌తో హెూమ్ సిరీస్:** 2024 ఆగస్టు 21 నుంచి సెప్టెంబర్ 3 వరకు రెండు టెస్ట్ మ్యాచ్‌లు ఆడుతుంది.

**ఇంగ్లాండ్‌తో హెూమ్ సిరీస్:** 2024 అక్టోబర్ 7 నుంచి అక్టోబర్ 28 వరకు మూడు టెస్ట్ మ్యాచ్‌లు ఆడుతుంది.

**ఆస్ట్రేలియా పర్యటన:** 2024 నవంబర్ 4 నుంచి నవంబర్ 18 వరకు మూడు వన్డేలు, మూడు టీ20లకు ఆస్ట్రేలియాలో పర్యటిస్తుంది.

**జింబాబ్వే పర్యటన:** 2024 నవంబర్ 24 నుంచి నుండి డిసెంబర్ 5 వరకు మూడు వన్డేలు, మూడు టీ20ల కోసం జింబాబ్వే వెళ్తుంది.

**దక్షిణాఫ్రికా పర్యటన:** 2024 డిసెంబర్ 10 నుంచి 2025 జనవరి 7 వరకు మూడు టీ20లు, మూడు వన్డేలు, రెండు టెస్ట్ మ్యాచ్‌లు ఆడేందుకు సుదీర్ఘకాలం దక్షిణాఫ్రికాలో పర్యటిస్తుంది.

**వెస్టిండీస్‌తో హెూమ్ సిరీస్:** 2025 జనవరి 16 నుంచి రెండు టెస్ట్ మ్యాచ్‌లు ప్రారంభమవుతాయి.

**స్వదేశంలో ట్రై-సిరీస్:** 2025 జనవరి 16 నుంచి ఫిబ్రవరి 14 వరకు న్యూజిలాండ్, దక్షిణాఫ్రికాతో ట్రై సిరీస్‌లో పాల్గొంటుంది.

**పాకిస్థాన్‌లో 2025 ఛాంపియన్స్ ట్రోఫీ:** ఇంకా తేదీలు ప్రకటించాల్సి ఉంది. ట్రై-సిరీస్ పూర్తయ్యాక ఛాంపియన్స్ ట్రోఫీ జరగవచ్చు.


**న్యూజిలాండ్ పర్యటన:** 2025 మార్చి 16 నుంచి ఏప్రిల్ 5 వరకు ఐదు టీ20లు, మూడు వన్డేలు ఆడుతుంది.



# చేజారిన కాంస్యం

## బ్యాడ్మింటన్ పురుషుల సింగిల్స్ పోరులో లక్షసేన్ పరాజయం

**పారిస్:** ఒలింపిక్స్‌లో కాంస్య పతకం సాధించే అవకాశాన్ని భారత స్టార్ షట్లర్ లక్షసేన్ కోల్పోయాడు. సోమవారం జరిగిన బ్యాడ్మింటన్ పురుషుల సింగిల్స్ కాంస్య పతక పోరులో సేన్ పరాజయం చవిచూశాడు. మలేసియా ఆటగాడు జియా లీతో జరిగిన పోరులో సేన్ ఓటమి పాలయ్యాడు. ఆసక్తికరంగా జరిగిన మ్యాచ్‌లో లీ 13-21, 21-16, 21-11 తేడాతో సేన్‌ను ఓడించాడు. తొలి సెట్‌లో సేన్ ఆధిపత్యం చెలాయించాడు. అద్భుత షాట్లతో ప్రత్యర్థిని ముప్పుతిప్పలు పెట్టాడు. సేన్ ధాటికి తట్టుకోలేక లీ చేతులెత్తేశాడు. దూకుడుగా ఆడిన సేన్ అలవోకగా సెట్‌ను దక్కించుకున్నాడు. రెండో గేమ్ ఆరంభంలోనూ సేన్ పైచేయి కనబరిచాడు. తన మార్క్ ఆటతో ప్రత్యర్థిని హడలెత్తించాడు. ఒక దశలో 85తో ఆధిక్యంలో నిలిచాడు. కానీ కీలక సమయంలో లీ పుంజుకున్నాడు. సేన్ దూకుడును అడ్డుకుంటూ పైచేయి సాధించాడు. మరోవైపు సేన్ తీవ్ర ఒత్తిడికి గురై వరుస తప్పిదాలకు పాల్పడ్డాడు. దీన్ని తనకు అనుకూలంగా మార్చుకోవడంలో సఫలమైన లీ సెట్‌ను దక్కించుకున్నాడు. ఇక ఫలితాన్ని తేల్చే కీలకమైన మూడో సెట్‌లో సేన్ గాయపడ్డాడు. ఇది అతని ఏకాగ్రతను దెబ్బతిసింది. మ్యాచ్ ఆడే క్రమంలో లక్షసేన్ మోచేతి నుంచి రక్తం వచ్చింది. చికిత్స తర్వాత సేన్ ఆటను కొనసాగించాడు. అయితే గాయం బాధ వెంటాడడంతో సేన్ తన స్థాయికి తగ్గ ఆటను కనబరచలేక పోయాడు. చివరికి సెట్‌తో పాటు మ్యాచ్ కోల్పోయి కాంస్య పతకాన్ని చేజార్చుకున్నాడు.



# టేబుల్ టెన్నిస్‌లో చరిత్ర సృష్టించిన భారత మహిళలు

**పారిస్:** పారిస్ ఒలింపిక్స్‌లో టేబు ల్ టెన్నిస్ టీమ్ ఈవెంట్‌లో భారత్ క్వార్టర్స్‌కు చేరింది. ప్రిక్వార్టర్స్‌లో 3-2 తేడాతో రొమేనియాపై గెలుపొందింది. దీంతో మనికా బాత్రా, ఆకుల శ్రీజ, అర్చనా కామత్‌లతో కూడిన భారత త్రయం ఒలింపిక్స్‌లో టేబుల్ టెన్నిస్ మహిళల టీమ్ ఈవెంట్‌లో క్వార్టర్ ఫైనల్‌కు చేరుకున్న తొలి భారత జట్టుగా రికార్డ్ సాధించారు. ముందుగా డబుల్స్‌లో ఆకుల శ్రీజ, అర్చనా కామత్ జోడీ అద్భుతం గా ఆడి మూడు గేమ్‌ల్లోనూ ఆధిక్యంలో నిలిచింది. 11-9, 12-10, 11-7తో దయాకోను, సమర ఎలిజబెటాను ఓడించ డం వల్ల భారత్ ఆధిక్యంలోకి వెళ్లింది. ఆ తర్వాత సింగిల్స్ మొదటి మ్యాచ్‌లో మనికా బాత్రా చెలరేగిపోయింది. 11-5, 11-7, 11-7తో బెర్నాడెట్టేను చిత్తు చేసింది. ఆ తర్వాత రొమేనియా పుంజుకొని వరుసగా రెండు మ్యాచ్‌ల్లో నెగ్గి 2-2తో స్కోరును సమం చేసింది. హెూరాహెూరీగా సాగిన సింగిల్స్ రెండో మ్యాచ్‌లో శ్రీజ 11-8, 4-11, 11-7, 6-11, 8-11 ఎలిజబెటా చేతిలో పోరాడి ఓటమిని చవిచూసింది. మూడో మ్యాచ్‌లో అర్చనా కామత్ 5-11, 11-8, 7-11, 9-11 బెర్నాడెట్టే చేతిలో ఓడిపోయింది.

# భారత హాకీ జట్టుకు షాక్

## సెమీస్‌కు డిఫెండర్ అమిత్ దూరం



**పారిస్:** పారిస్ ఒలింపిక్స్‌లో భారత హాకీ జట్టు అదరగొడుతోంది. ప్రిక్వార్టర్స్‌లో బ్రిటన్ ను ఓడించి సెమీస్ కు చేరుకుంది. అయితే.. సెమీస్ చేరుకున్న ఆనందంలో ఉన్న భారత జట్టుకు గట్టి షాకిచ్చింది ఒలింపిక్ కమిటీ. కీలక ఆటగాడు అమిత్ రోహిదాస్ పై ఓ మ్యాచ్ నిషేదం విధించింది. దీంతో అతడు సెమీస్‌లో ఆడే వీలులేకుండా పోయింది. అతడు లేకుండా మంగళవారం జర్మనీతో జరగనున్న సెమీస్‌లో భారత్ ఆడాల్సి ఉంది. ఇది భారత జట్టుకు గట్టి ఎదురుదెబ్బగానే చెప్పవచ్చు. దీనిపై భారత హాకీ సమాఖ్య స్పందించింది. ఇలాంటి ఘటనలతో ప్లేయర్లలో ఆత్మవిశ్వాసం సన్నగిల్లే ప్రమాదం ఉందని అంది. బ్రిటన్‌తో జరిగిన మ్యాచులో రిఫరీల నిర్ణయాలపై అసంతృప్తిని వ్యక్తం చేసింది. రోహిదాస్ సస్పెన్షన్ పై మండిపడింది. ఈ నిర్ణయాన్ని అంతర్జాతీయ హాకీ ఫెడరేషన్‌లో సవాల్ చేసింది. అయితే దీనిపై అంతర్జాతీయ హాకీ సమాఖ్య విచారణ చేసి సోమవారం రోజున నిర్ణయం ప్రకటించే అవకాశం ఉంది. ఆదివారం బ్రిటన్‌తో జరిగిన క్వార్టర్ ఫైనల్ మ్యాచులో అమిత్ దాస్‌కు అంపైర్ రెండ్ కార్డు ఇచ్చాడు. మ్యాచ్ 17వ నిమిషంలో ఈ డిఫెండర్ రోహిదాస్ బంతితో పాటుగా వెళ్లే ప్రయత్నం చేయగా వెనకాల నుంచి వచ్చిన బ్రిటన్ ఆటగాడు అడ్డుకునే ప్రయత్నం చేశాడు. ఈ క్రమంలో రోహిత్ దాస్ స్టిక్ పొరబాటున ప్రత్యర్థి ఆటగాడికి తగిలింది. వెంటనే రిఫరీ అమిత్ రోహిదాస్‌కు రెడ్ కార్డు ఇచ్చాడు. దీంతో భారత్ 40 నిమిషాల పాటు 10 ఆటగాళ్లతోనే ఆడింది. ఈ క్రమంలోనే అమిత్ దాస్‌పై ఓ మ్యాచ్ నిషేదం విధించారు.



# సచిన్ రికార్డు బద్దలు కొట్టిన రోహిత్ శర్మ

**న్యూఢిల్లీ :** శ్రీలంకతో జరుగుతున్న రెండో వన్డేలోనూ భారత కెప్టెన్ రోహిత్ శర్మ సూపర్ ఇన్నింగ్స్ తో అదరగొట్టాడు. వరుస రెండో హాఫ్ సెంచరీ కొట్టడంతో పాటు భారత లెజెండరీ ప్లేయర్ సచిన్ టెండూల్కర్ రికార్డును సైతం బ్రేక్ చేశాడు. అంతర్జాతీయ క్రికెట్‌లో అత్యధిక 50ం స్కోర్లు చేసిన భారత ఓపెనర్‌గా సచిన్(120) పేరిట ఉన్న రికార్డును రోహిత్ శర్మ(121) బ్రేక్ చేశారు. తాజాగా శ్రీలంకతో జరిగిన రెండో వన్డేలో ఈ ఘనతను అందుకున్నారు. అలాగే వన్డేల్లో తొలి పది ఓవర్లలోపు అత్యధిక ఫిఫ్టీలు కొట్టిన భారత బ్యాటర్ల లిస్టులో హిట్‌మ్యాన్(4) రెండో స్థానంలో ఉన్నారు. సెహ్వాగ్(7) తొలి స్థానంలో కొనసాగుతున్నారు. శ్రీలంకపై భారత్ ఓటమిని అభిమానులు జీర్ణించుకోలేక పోతున్నారు. కెప్టెన్ రోహిత్ శర్మ ఒక్కడే పోరాడుతున్నా మిగతా బ్యాటర్లు చేతు లెత్తేస్తున్నారు. తొలి వన్డేలో 75/0తో పటిష్ఠ స్థితిలో నిలిచిన టీమ్ ఇండియా 230కి ఆలౌటైంది. రెండో వన్డేలో 97/0 నుంచి 208కే చాప చుట్టేసింది.

Printed, Published and Owned by Adula Thirupathi, Printed at Ramani Web Offset Printers, H.No 8-82/11/1, Auto Nagar, Bommakal Road, Village, mdl & Dist : Karimnagar 505001,Telangana State, Published from 2-5-23, Mudhiraj street, Vemulawada Town, mandal, Siricilla Dist, (Karimnagar Dist) 505302,Telangana State. **Editor: Adula Thirupathi.** Email: prajanaava@gmail.com. Phone No: 99484 33277. RNI NO: TELTEL/2023/87657